డిసెంబర్ - 2019

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక మాస పత్రిక


ప్రధాన సంపాదకులు :

**రెవ.డా॥ కె. జోసఫ్**

సర్క్యులేషన్ :

**సామ్రాట్ కొడవటికంటి**

చందా వివరాలు :

సంవత్సర చందా రూ. 250/-

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-

చిరునామా :

ఎడిటర్, పరిశుద్ధత

పోస్ట్‌బాక్స్ నెం. 28, క్లాపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9704255416

బ్యాంక్ అకౌంట్ వివరాలు :

A/c Name: **K. Joseph**

A/c No.: **10957380353**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890


## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| తిమోతి | కొడవటికంటి | 03 |
| పాపుల రక్షకుడేసు | రెవ.కె.జోసఫ్‌గారు | 06 |
| యేసుతల్లి మరియ | రేచెల్ జోసఫ్ | 08 |
| మదర్ తెరీసా | బ్రదర్ కె. సామ్రాట్ | 10 |
| బైబిల్లో క్రీస్తు | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 12 |
| దేవుడు-సిరి | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 13 |
| గొఱ్ఱెల కాపరులు | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 14 |
| సువర్తమానము | కె. లక్ష్మిప్రియ, ఒంగోలు | 16 |
| బైబిలు కథలు- నెహెమ్యా | రెవ.డా॥కె.జోసఫ్‌గారు | 18 |
| క్రొత్త కోణాలు | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 20 |
| అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | 24 |



INDIA EVANGELISTIC & RELIEF FELLOWSHIP

EVANGELISM
- Church Planting
- Evangelistic Crusades
- Pastor's Seminars
- Youth Ministry
- T.V.Ministry
- Magazine Ministry
- Audio Ministry
- Jail & Prison Ministry
- IERF International Ministry
- Hanna Women Ministries

RELIEF
- Orphanage
- Child Development Centers
- Education (U.C.L.I. Schools)
- Widows & Lepers Care
- Medical Assistance
- Help in Natural Calamity
- Flood Relief
- Mobile Medical Ministry
- Children Care Ministry

# సంపాదకీయం.....



పియ పరిశుద్ధత పాఠకులకు క్రిస్మస్ శుభాకాంక్షలు.

క్రైస్తవులందరూ అత్యంత ఘనంగా జరుపుకునే క్రిస్మస్ పండుగ ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా వచ్చేసింది. ఏ మాత్రం మార్పు లేదు, అదే తంతు, కొత్తబట్టలు, పిండివంటలు, బిరియానీలు, అంతా బిజీబిజీ. యేసు పుట్టిన రోజు పండుగ యేసు లేకుండానే జరుపుకోవడం షరా మామూలే. ప్రపంచంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రతి మార్పు యేసుక్రీస్తు రెండవ రాకడ సమీపంగా ఉన్నదని తెలియజేస్తుంది. మన దేశంలో కూడా గత కొంతకాలంగా తీవ్రమైన అలజడి, దేవుని సంఘాలలో అల్లర్లు, సేవకులపై తీవ్ర విమర్శలు, దేవుని ప్రజలకు శ్రమలు..... సమాజంలో జరుగుతున్న ఈ నూతన పరిణామాలు దేవుని రెండవ రాకడకు ముంగుర్తు. మనం ఎంత బిజీగా ఉన్నా, ఎన్ని పండుగలు చేసుకున్నా, దేవుని ప్రవచనాల నెరవేర్పులను నిశితంగా గమనిస్తూ, దేవుని రెండవ రాకడకు మనల్ని మనం సిద్ధం చేసుకోవాలని కోరుతున్నాను.

'పాఠకుల పేజీ' ని ఉపయోగించుకొని చందాదారులు మీ కుటుంబ సభ్యుల యొక్క జన్మదిన శుభాకాంక్షలను పత్రికాముఖంగా తెలియజేయవచ్చును. చందా కట్టని వాళ్ళు, చందా కట్టటం ద్వారా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చు. మీరు బ్యాంక్ అకౌంట్ ద్వారా ఆన్‌లైన్‌లో మనీ ట్రాన్స్‌ఫర్ చేయదలచినట్లయితే మా అకౌంట్ నంబర్‌కి ట్రాన్స్‌ఫర్ చెయ్యండి. K. Joseph, A/c No. 10957380353, SBI Main Branch, Ongole, IFSC Code SBIN0000890. మీరు ఆన్‌లైన్‌లో మనీ ట్రాన్స్‌ఫర్ చేసినట్లయితే దయచేసి మాకు 9440217726 నంబర్‌కి ఫోన్ చేసి చెప్పండి లేదా మీ పేరు, పత్రిక అడ్రస్ లేబుల్ మీద మీ సీరియల్ నంబర్, ట్రాన్స్‌ఫర్ చేసిన మొత్తం SMS చెయ్యండి. చందాదారుల వివరాలను పత్రికా ముఖంగా ప్రచురిస్తున్నాము. ఒకవేళ మీరు చందా కట్టినప్పటికీ మీ పేరు చందాదారుల లిస్టులో లేనట్లయితే వెంటనే మాకు తెలియజేయండి. బైబిల్ క్విజ్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని బైబిల్‌జ్ఞానం సంపాదించుకోవాలని కోరుతున్నాను. దేవుడు మిమ్మును సదాకాలము దీవించును గాక! ఆమెన్!

-ఎడిటర్

**K. Joseph, SBI Main Branch, Ongole**
**A/c No. 10957380353**

| సీరియల్ నంబరు | |
|---|---|

సీరియల్

# తిమోతి

**21**

**(అపొస్తలుడు మూడవభాగం)**

**– కొడవటికంటి**

పౌలుకు ఎఫెసు పట్టణ అధికారులు స్నేహితులు గనుక అలెగ్జాండర్ ఏమి చెయ్యలేకపోయాడు. పౌలు పెంతెకొస్తు నాటికి ఆసియా, అకయ, గ్రీసు, మాసిదొనియ సంఘము లలో కూర్చిన చందా తీసుకొని యెరూషలేము చేరాలన్న యోచనలో ఉన్నాడు. తిమోతిని ఎరస్తును ముందుగా మాసిదోనియాకు వెళ్ళి అక్కడ సంఘాలలో చందా తీసుకొని ఫిలిప్పీలో కలిసికోవాలని చెప్పి వారిని పంపించాడు. తీతును కొరింథు మీదుగా వచ్చి త్రోయలో కలిసికొనమని చెప్పి పంపించాడు.

లూకాకి తిమోతి ప్రక్కన లేకుంటే అంత హుషారు గా లేదు. తిమోతితో మాట్లాడినంత చనువుగా పౌలుతో మాట్లాడలేము కదా! అనుకున్నాడు. ఎఫెసులో వీడ్కోలు సభ అయిపోయిన నాటనుండి పౌలు ముభావంగా ఉన్నాడు. తిమోతి ఉంటే ఆయనకు కుమారుడు ఉన్నంత ఆదరణ. అసలు పౌలు దప్పికగొంటే ఆయన చెప్పక ముందే తిమోతి నీరు అందిస్తాడు. ఎఫెసు నుండి స్ముర్న, పెర్గెముకు అద్రిముక్తై నుండి త్రోయకు వెళ్ళాలి. నూట యాభై మైళ్ళు ఉంటుంది. చిన్న ఆసియాలో ఇవి ముఖ్యమైన పట్టణాలు. రోమీయులకు మంచి ఆదాయం తెచ్చే పంటచేల వంటివి. మొదటిరోజు ప్రయాణంలో బగ్గీలో ఎక్కువ మంది లేరు. పదిమంది ప్రయాణికుల బగ్గీలో ఆరుగురే ఉన్నారు. అందువల్ల విశ్రాంతిగా కూర్చున్నారు. స్ముర్న నుండి ప్రయాణికుల రద్దీ ఎక్కువ. బాట అంతా సముద్రానికి దగ్గరలో ఉన్నందువల్ల చల్లగా ఉంది. "ఇంతవరకు ఎక్కడికి వెళ్ళినా యూదుల వల్లనే శ్రమలు అనుభవించాను. అన్యజనుల వల్ల ఉద్దేశ్య పూర్వకంగా ఎన్నడూ సువార్తకు ఆటంకం కలుగలేదు. ఎఫెసు పట్టణంలోనే తొలిసారి ఇలా జరిగింది" అన్నాడు పౌలు. "అన్యజనుల వల్ల హింస జరుగకుండా అన్య జనులే అడ్డుకొన్నారు కదా" అన్నాడు లూకా. "వాళ్ళు గాయిని పట్టుకొన్నప్పుడు నువ్వెకడ ఉన్నావు?" అన్నాడు పౌలు. "నేనూ ప్రక్కనే ఉన్నాను కాని, వారి మనిషి నని వారనుకోలేదు. అర్తిమదేవి పతనకాలం ప్రారంభమైందని ఎఫెసీయులు అనుకోవటం విన్నాను" అని చెప్పాడు లూకా.

"అర్తిమాదేవికి జీవంలేదు. అది పతనమైనా కాకు న్నా ఎఫెసు, యెరూషలేమును అధిగమిస్తుంది" అన్నాడు పౌలు. లూకా, పౌలు ముఖం లోకి అలానే చూస్తుండి పోయాడు. కొంచెం తెప్పరిల్లి "మరి యెరూషలేము" అన్నాడు. పౌలు చిన్నగా నవ్వాడు. కాని మధ్యలోనే ఆపి ముఖం గంభీరంగా పెట్టి "యెరూషలేమును గూర్చి ప్రభువు ఒలీవల కొండమీద శిష్యులతో చెప్పింది గుర్తులేదా?" అని అడిగాడు.

లూకా ముఖం మెరిసింది. ఆనాడు అపొస్తలులతో ప్రభువు మూడు సంవత్సరాలు మాట్లాడిన విషయాలన్నీ పౌలుతో ఖచ్చితంగా ఆత్మలో మాట్లాడుతున్నాడేమో. ఒకసారి పౌలు తన ప్రసంగంలో "నేనైతే మిక్కిలి శ్రేష్ఠులైన ఈ అపొస్తలుల కంటే లేశమాత్రమును తక్కువ వాడనుకాను" అన్నాడు. మరొకసారి "తన కృపచేత నన్ను పిలిచిన దేవుడు నేను అన్యజనులలో తన కుమారుని ప్రకటించవలెనని ఆయనను నా యందు బయలుపరచ నను గ్రహించినప్పుడు మనుష్య మాత్రులతో నేను సంప్రదించలేదు. నాకంటే ముందుగా అపొస్తలులైన వారి ఎవరి యొద్దకు వెళ్ళలేదు" అన్న మాటలు జ్ఞాపకా నికి వచ్చాయి.

"ఏంటి ఆలోచిస్తున్నావు?" అన్న పౌలు పిలుపుకు "అబ్బే ఏంలేదు, అయితే ఇప్పుడున్న సంఘాలు స్థంభాలా?" అన్నాడు. "ఎదుగుతున్న శిశువు స్వరూపం ఎప్పుడూ మారుతూనే ఉంటుంది" అన్నాడు పౌలు. "బిడ్డలను కనే స్త్రీ వేదన పురుషునికి ఉండదేమో? అన్నాడు మరలా. "అంటే సువార్త సేవకులకే ఎక్కువ

బాధ్యత అప్పగింపబడిందంటావా?" అన్నాడు లూకా. "బాధ్యత తీసుకొనుటకు ఇష్టపడిన వానికే అప్పగింప బడుతుంది. కాని బలవంతంగా ఇవ్వబడదు. అవునూ, మీరు వ్రాస్తున్న యేసుకథ ఎంతవరకు వచ్చింది" అన్నాడు పౌలు.

"ఇంకా తరచి చూడవలసిన ప్రదేశాలు మనుష్యులు చాలా మంది మిగిలారు. శిలువ వేయబడినప్పుడు విధి నిర్వాహణలో ఉన్న శతాధిపతిని చూశాను" అన్నాడు. "యూలి" అన్నాడు పౌలు. "అవును, మీకు తెలుసు కదా! మీ సంగతి నాకు చెప్పాడు. ప్రభువు పునరు త్థానుడవుటకు ముందు సమాధి యొద్ద కావలాకు నియమింపబడిన సైనికులు ఇప్పుడు రోమాలో ఉన్నారు. వారిని ఎలా కలుసుకోగలను?" అన్నాడు లూకా. "కలుసుకుంటావు" అన్నాడు పౌలు. "ఎలా?" అన్నాడు పౌలు ముఖంలోకి చూస్తూ. "త్వరలో మనం వెళ్తాము" అన్నాడు పౌలు.

నాలుగు రోజులు తర్వాత త్రోయకు చేరారు. త్రోయలో సంఘము చాలా వడిగా వృద్ధిగాంచినది. సభ్యుల సంఖ్య గణనీయంగా పెరిగే కొద్దీ ప్రభువునందు వారి ఆసక్తి కూడా అలానే పెరిగింది. లూకా కూడా ఫిలిప్పీ నుండి అప్పుడప్పుడు త్రోయకు వచ్చి వాక్య పరిచర్య చేయటం కూడా అందుకు ఒక కారణమని పౌలుకి తెలుసు. త్రోయలో కొన్ని రోజులు గడుపు దామనుకొన్న లూకాకి ప్రయాణం కొనసాగింపబడటం బాగలేదు. పౌలు చిరాకుగా ఉన్నాడు. మరి తీతు ఎందుకనో ఇంకా ఇక్కడికి రాలేదు. తీతు వస్తే ఫిలిప్పీ మీదుగా వస్తాడు కాబట్టి ఫిలిప్పీకి వెళ్దామని బయలు దేరాడు. ఫిలిప్పీ వచ్చేటప్పటికి పౌలు శారీరకంగాను, మానసికంగాను బాగా కృంగిపోయాడు. ఇటువంటి రుగ్మతకు తానిచ్చే మందు కంటే కుమారునివంటి తిమోతి ఆదరణ ఆయనకు ఎంతో అవసరం అనుకు న్నాడు లూకా. అయితే దేవుని దయవలన ఆ మరునాడే తీతు కొరింథు నుండి వచ్చాడు. తీతును చూడగానే పౌలు పాతిక సంవత్సరాల యౌవనునివలె చురుగ్గా మారిపోయాడు. మరి ముఖ్యంగా కొరింథీయుల యొక్క సత్ ప్రవర్తనను గూర్చిన తీతు సాక్ష్యము ఆయనకు ఎంతో ఆనందం కలిగించింది.

ఆ మరునాడే లూదియ ఇంటివద్ద గదిలో కూర్చుని కొరింథీయులకు పత్రిక వ్రాయించాడు. ఉదయం కూర్చుంటే సాయంకాలం దాకా తీతు పత్రిక వ్రాస్తూనే ఉన్నాడు. ఈ కార్యక్రమం తరువాత పౌలు పూర్తిగా ఒక రోజంతా విశ్రమించాడు. తిమోతి, తీతు, లూకా కూర్చుని ఉన్నప్పుడు త్రోయకు వెళ్ళి అక్కడ మూడు నెలలు గడిపి తూరు సీదోనుల మీదుగా ప్రయాణించాలని చెప్పాడు.


వ్రాసిన పత్రికను తీతు చేతికిచ్చి మరలా కొరింథుకు పంపించి తాను కొరింథుకు త్వరలో వచ్చునప్పటకి యెరూషలేములోని విశ్వాసులకైన చందా వసూలు చేసి ఉంచమన్నాడు. తీతు మధ్యలో ఎక్కువగా బసచేయకుండా నేరుగా కొరింథు వెళ్ళాల్సి ఉంది. పౌలు, తిమోతి, లూకా థెస్సలొనీక, బెరయ, ఎథెన్సు పట్టణాల్లోని సంఘాలను బలపరచి కొరింథు చేరాల్సి ఉంది. కొరింథులో ఈసారి కొంచెం నెమ్మది కలిగినా అనేకమైన సమస్యలు క్రొత్తవి తలెత్తుట పౌలుకు బాధాకరంగానే ఉంది కొరింథులో గాయి వాళ్ళ ఇంట్లోనే అందరూ బసచేశారు. ఇంతకు ముందైతే అకుల ప్రిస్కిల్ల ఉండేవారు. ఇప్పుడు వారు రోమాలో సేవచేస్తున్నందున గాయి ఇంటిలో బసచేశారు. పౌలు, ఎఫెసును వదలినప్పుడే అకుల ప్రిస్కిల్ల రోమా బయలు దేరారు. క్లౌదియ చక్రవర్తి చనిపోయిన తర్వాత రోమీయులకు పత్రిక వ్రాయించ మొదలుపెట్టాడు. తిమోతి పత్రిక వ్రాస్తున్నారు. ఉత్తరం పూర్తి అయిన తర్వాత పౌలు ఆ ఉత్తరం తన చేతిలోకి తీసుకొని పెద్ద అక్షరాలతో సంతకం చేసి తిమోతిని అయిదు మైళ్ళ దూరంలో ఉన్న కెంక్రేయ వెళ్ళి ఫీబేని పిలుచుకొని రమ్మన్నాడు. ఈ దినాలలో ఆమె తన సొంతపని మీద రోమా వెళ్ళుచున్నది. పత్రిక ఆమె తన వెంట తీసుకొని వెళ్తుంది అన్నాడు.

కొరింథు నుండి సంఘాలన్నీ పరామర్శించి ఫిలిప్పీ చేరుకొనేటప్పటికి మూడు నెలలు పట్టింది. ఫిలిప్పీ

వచ్చిన తర్వాత తిమోతిని పిలిచి సొప్రతు, అరిస్తర్కు, సెకుందు, గాయి, తుకికు ఈ ఆరుగురిని తీసుకొని త్రోయలో తన కొరకు కాచుకొనియున్న సిరియా యూదు లు నేను ఈ మార్గమున ప్రయాణం చేయటం లేదని వీరిని మాత్రం చూసి వెనుకకు వెళ్ళిపోతారు" అన్నాడు. "సిరియా యూదులు ఎందుకు వస్తారు?" అన్నాడు లూకా. "నా మీద కుట్రచేసి ఉన్నారు" అని అన్నాడు. కాని ఈ సంగతి పౌలుకి ఎవరు చెప్పారని అడుగలేదు లూకా.

"పులియని రొట్టెల పండుగ మనం ఫిలిప్పీలో ఆచరించి ప్రయాణం చేద్దాము. ఆ పండుగను త్రోయలోని సంఘస్తు లతో ఆచరించిన తర్వాత మనము వారిని అక్కడ కలుసు కుందాం"అని త్రోయలో కొంతకాలం గడిపి గలతీ మీదుగా కాక సముద్ర ప్రయాణంలో మినిత్, రోదె, పతరము, ఫినికే ద్వారా ప్రయాణం చేద్దాము" అని వివరించాడు. త్రోయలో స్థానికులుకాక తిమోతితో, ఆసియా, యూరప్ నుండి వచ్చిన సహోదరులతో పండగ సంబరంలాగా అనిపిం చింది. రాత్రింబగళ్ళు వాక్య పరిచర్యలో ఉన్నప్పటికీ రోజులు తొందరగా గడిచిపోయాయి. తీతు, మార్కు కూడా తమ వద్ద ఉంటే ఇంకా బాగుండేది అనుకున్నాడు తిమోతి. ఈ మధ్య ఎక్కువ సార్లు పౌలుని వదలి ఉండవలసి వస్తుంది. ఇదంతా పౌలు ప్రణాళికో లేక దైవ నిర్ణయమో ఆలోచించే తీరిక లేకపోయింది. ఇప్పుడు మరలా తెల్లవారి యెరూషలేము ప్రయాణం ఈసారి సముద్ర మార్గం ద్వీపం మీదుగా వెళ్తే సముద్రంలో పడిపోయిన నాలుగు వందల ఎనభై అడుగుల అపొల్లో కంచు విగ్రహం చూడవచ్చు అనుకున్నారు. ఆదివారం ఉదయం నుండి రొట్టె విరచుట, పౌలు వాక్యపరిచర్య. తెల్లవారితే ప్రయాణం. సాయంకాలం భోజనాలైన తర్వాత మూడవ అంతస్తులో ప్రార్థనకు విశ్వాసులందరూ కూడుకున్నారు. తెల్లవారితే ప్రయాణమని పౌలు రాత్రి చాలాసేపు ప్రసంగించారు. చాలా మంది చిన్న పిల్లలు, వృద్ధులు కూడా ఆసక్తిగా వాక్యము వింటున్నారు. ఆ గదంతా దీపాలతో నిండిపోయింది. అంతేకాక మూడవ అంతస్తులో ఉన్నందున సముద్రము నుండి వచ్చే గాలి అలసట పోగొడుతుంది. పౌలు ప్రసంగం ముగిస్తారనగా వీధివైపు ఉన్న కిటికీ వద్ద నుండి పెద్ద అరుపు విని పించింది. దాని వెంబడి అనేక మంది అరుపులు, కొందరు స్త్రీలు ఏడవటం ప్రారం భించారు. తిమోతి గబగబ మెట్లు దిగి వీధిలోనికి వచ్చి పైకి చూసి ఏ కిటికీలో నుండి మనుష్యులు క్రిందికి చూస్తున్నారో ఆ కిటికీ క్రిందకు వస్తే ఏదో ఒక మనిషి కనిపించాడు. ఎవరో దూరంగా కాగడా తీసుకొని వస్తున్నారు. తిమోతి దగ్గరకు వెళ్ళి తలక్రింద చెయ్యిపెట్టి చూస్తే అంతా రక్తమే. వెచ్చగా ఉంది. నిర్జీవంగా పడివున్నాడు. నాడి చూస్తే అతను మరణించాడని అర్థమైంది. ఎవరో ఏడు స్తూ "ఐతుకు, ఐతుకు" అంటున్నారు. గబగబా వస్తున్న పౌలుని చూసి తిమోతి లేచి నిలుచున్నాడు. పౌలు వంగి అతనిని రెండు చేతులతో తన గుండెకు ఆనించు కొని నిశ్శబ్దంగా ఉన్నాడు. కొందరు స్త్రీలు ఏడుస్తున్నారు. మీరు తొందరపడకుడి "అతని ప్రాణము అతనిలో ఉంది" అన్నాడు. అతను చనిపోయాడని తిమోతికి తెలుసు. మరి పౌలు ఎందుకు అలా అన్నాడని అనుకుంటుండగా పౌలు తిమోతి వైపు చూశాడు తిమోతి ఆ మరణించిన యువకుడిని భుజంమీద వేసుకొని పౌలు ప్రసంగించిన స్థలం ప్రక్కనే ఉన్న గదిలో పడుకోబెట్టాడు. పౌలు లోపలకి రాగానే తిమోతి బయటకు వచ్చాడు. అందరూ ఆతృతగా చూస్తున్నారు. పది నిమిషాల తర్వాత గదిలో నుండి వచ్చిన పౌలు మేడగదిలోనిక పదండి అన్నాడు. గొళ్ళెంపెట్టి ఆయన మేడగదిలోనికి వచ్చి రొట్టెవిరిచి, పుచ్చుకొని తెల్లవారే వరకు ప్రసంగిస్తూనే ఉన్నాడు. సభ ముగించిన తర్వాత ఆయన గది యొద్దకు వచ్చి గొళ్ళెం తీసి తలుపు తెరచి, 'ఐతుకు' అని పిలిచాడు. ఐతుకు నిద్రలేచిన వానివలె బయటకు వచ్చాడు. అతడు మరణించిన తర్వాత ప్రభువు అతనిని బ్రతికించిన దానికి గుర్తుగా అతని వస్త్రము మీద పౌలు వస్త్రముల మీద, తిమోతి వస్త్రముల మీద అతని రక్తము అప్పుడే సముద్రంలో నుండి పైకి లేచిన సూర్యుని వెలుతురులా ఇంకా ఎర్రగా మెరుస్తుంది.

**(సశేషం)**



# పాపుల రక్షకుడేసు జన్మించిన పండుగే క్రిస్మస్

రెవ.డా॥ కె.జోసఫ్

క్రీస్తు పుట్టుక అనునది మహాదేవుని బృహత్తర ప్రణాళిక. ఆదాము హవ్వల వలన పాపము భూమికి ప్రాప్తించినప్పుడే ఈ పాపమనే మురికి, పవిత్ర రక్తము ద్వారా శుద్ధిచేసే ప్రణాళిక దేవుడు ఏర్పాటు చేశాడు. రక్తముతోనే ఎందుకు, ఏమిటి అని మనం ప్రశ్నించలేము. దేవుడు చెప్పినట్లుగా చేయటమే మన పని. దేవుని జ్ఞానము శోధింప శక్యము కానిది.

అప్పటిలో పాపము లేనివి జంతువులే కనుక జంతుబలి చేసి వాటి చర్మంతో చర్మపు వస్త్రాలను చేసి వారికి ధరింపచేశాడు. అయితే ఈ జంతు రక్తము పాపమును శాశ్వతంగా తొలగించ లేదు. ***"మరియు ప్రతి యాజకుడు దినదినము సేవ చేయుచు పాపములను ఎన్నటికి తీసి వేయలేని ఆ బలులనే మాటిమాటికి అర్పించుచు ఉండును"*** హెబ్రీ 10:11 అందువల్ల శాశ్వతంగా తొలగించుటకు పవిత్రమైన రక్తము అనగా పాపములేని పరిశుద్ధ రక్తము కావలసి వచ్చింది. అయితే ఏ భేదము లేకుండా అందరూ పాపము చేయుట వలన దైవమే దిగి వచ్చి భూమి మీద తన రక్తము చిందించవలసి వచ్చింది. ఒక్క బైబిలులోనే కాక ఇంకా అనేకమైన వేద పుస్తకాలలో యేసు జన్మమును గూర్చి వ్రాయబడి ఉన్నది. ఆయన అనగా యేసు రక్తమే పాపములను కడుగునని కూడా వ్రాయబడి ఉన్నది. "రుగ్వేదంలో సమస్త పాపములు రక్తముతోనే శుద్ధి చేయబడును. ఆ రక్తము దేవునిదే కావలెను అని వ్రాయబడి ఉన్నది". అందువలననే యేసు ఈ బలికి అభిశక్తుడై ప్రవచనాల ప్రకారము మానవుడిగా కన్యకకు జన్మించాడు. బైబిల్లో కూడా ***"రక్తము చిందింపకుండా పాపక్షమాపణ కలగదని"*** హెబ్రీ 9:22లో వ్రాయబడినది. ఆ రక్తము చిందించుటకే యేసు ఈ లోకంలో మానవుడుగా జన్మించాడు. వేవేల దూతల చేత పరిశుద్ధుడు పరిశుద్ధుడు అని నిత్యం కొనియాడబడుచు అతి పరిశుద్ధస్థలంలో దేవునితో సమానంగా నివసించు దైవకుమారుడు భూలోకంలో ఒక స్త్రీ గర్భములో 9 నెలలు నివసించుటకు ఆ గర్భము ఎంత పవిత్రంగా పరిశుద్ధంగా ఉండవలెనో ఆలోచించండి. కనుకనే హవ్వ మొదులుకొని కన్య మరియ వరకు దేవుడు పరీక్షించగా చివరకు మరియ దేవుని దయను పొందినది. యేసు జన్మించుటకు కాలము కూడా సరిపోయినది. కాబట్టి మరియ గర్భమును దేవుడు ఒక పరిశుద్ధ స్థలముగా చేసి ఉంటాడు. కనుకనే లూకా 1:35లో గబ్రియేలు దూత మరియతో ***"సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనును గనుక పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారుడనబడును"*** అన్నది. కనుక కాలములు సంపూర్ణమైనపుడు దేవుడు తన కుమారుని పాపప్రాయశ్చిత్తార్ధబలిగా ఈ లోకములోనికి పంపించాడు. ఆయన జన్మ జ్ఞాపకంగా క్రిస్మస్ పండుగగా మనము ఆచరిస్తున్నాము. christamasలో christ అంటే క్రీస్తు mas అంటే బలిలో వేయబడే మూలపదార్ధం అంటే బలిపశువుగా వచ్చిన క్రీస్తుని అర్ధము. యోహాను భక్తుడు కూడా యేసుని లోకపాపములు మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల



అని ప్రకటించాడు. అంటే లోకంలో ఉన్న మనుష్యులందరి పాపముల కొరకు బలికానున్న గొఱ్ఱెపిల్ల అని అర్థం.

అయితే ఆనాటి యూదులు క్రీస్తు రాజుగా వచ్చి తమను రోమా సామ్రాజ్యపు బానిసత్వం నుండి విడిపించునని ఎదురు చూస్తున్నారు. ఆయన ఒకరాజుగా వచ్చి రోమా సామ్రాజ్యాన్ని జయించి తమకు స్వాతంత్ర్యం అనుగ్రహిస్తాడని వాళ్ళ నమ్మకం. అయితే యేసు వచ్చింది పాప దాసత్వం నుండి విడిపించి మానవులను స్వతంత్రులుగా చేసి నీతి సామ్రాజ్య మును స్థాపించుటకు అని తెలిసికొనలేకపోయారు. పశువుల పాకలో బీదగా పుట్టిన యేసు తాము కనిపెట్టుచున్న క్రీస్తు అని గ్రహింపలేదు. కనుకనే యేసుకు విరోధంగా ప్రవర్తించారు.

యేసు జన్మను ఆకాశమందలి నక్షత్రం ప్రకటించింది. ప్రవచన ప్రకారం నక్షత్రమును చూచిన అప్పటి మహా జ్ఞానులు తమ గ్రంథాలు పరీక్షించి దైవ కుమారుడు యూదయా దేశంలో జన్మించాడని గ్రహించారు. వీరు ఖగోళశాస్త్రం తెలిసిన మహా జ్ఞానులు. దాదాపు 2 సం॥లు ప్రయాణం చేసి యూదయ దేశమునకు వచ్చి దైవ కుమారుని దర్శించారు . పుట్టినవాడు దైవకుమారుడు అని గ్రహించి అంత దూరము ప్రయాణం చేసి వచ్చి యేసుని పూజించారు. మామూలుగా ఒక రాజ కుమారుడైతే వేరే దేశపు జ్ఞానులు అంత ప్రయాసపడి రారు, పూజించరు.

యేసు పుట్టిన రోజు రాత్రి దూత సమూహం పొలంలో తమ మందను కాయుచున్న కాపరులకు ఈ వర్తమానం తెలియజేశారు. మరి గొల్లలకే దూతలు ఈ శుభవార్త తెలియజేయుటకు కారణమేంటి? ఈ గొఱ్ఱెల కాపరులు మామూలు గొఱ్ఱెల కాపరులు కారు, వీరు కాసే గొఱ్ఱెలు ప్రత్యేకమైనవి. అవి పాపప్రాయశ్చిత్తార్థం బలి చేయబడే ప్రత్యేకమైన గొఱ్ఱెలు. మచ్చ డాగు లేనివి. దూర ప్రాంతాల నుండి యెరూషలేము దేవాలయానికి వచ్చి పాపప్రాయశ్చిత్తము చేసేవాళ్ళు తమ ఊళ్ళ నుండి గొఱ్ఱెలను తోలుకురారు. అక్కడే తయారుగా ఉన్న గొఱ్ఱెలు కొని తీసుకెళ్తుంటారు. ఈ గొఱ్ఱెల కాపరులు యెరూషలేము చుట్టు ఉండి గొఱ్ఱెలను కాస్తుంటారు. అందుకే ఆ దూతలు వీరికి ప్రత్యక్షమై అయ్యా ఇక మీ గొఱ్ఱెలతో పని లేదు, అందరి పాపముల కొరకు బలికాబడే అసలైన దేవుని గొఱ్ఱెపిల్ల జన్మించింది. లోకరక్షకుడు బేత్లెహేములో జన్మించాడు అని ప్రకటించారు. ఆ గొల్లలకు ఈ శుభవార్తలోని మర్మం అర్థమయింది కనుకనే తమ మందలను విడిచి ఆ రాత్రికి రాత్రే బేత్లెహేముకు వెళ్ళి రక్షకుని దర్శించి ఆ శుభవార్త అందరికి ప్రకటించారు.

ఈ విధంగా దేవుని మహా ప్రణాళికలో లోకరక్షకుడు జన్మించాడు. ఈయన మన పాపములకు విముక్తి. ఈ సంగతులు కూడ దూత యోసేపునకు తెలియజేసింది. ***"యోసేపూ నీ భార్యయైన మరియను చేర్చుకొనుటకు భయపడకుము, ఆమె గర్భము ధరించినది పరిశుద్ధాత్మ వలన కలిగినది; ఆమె యొక కుమారుని కనును; తన ప్రజలను వారి పాపముల నుండి ఆయనే రక్షించును. గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టుదువు"*** (యేసు అనగా రక్షకుడు) మత్తయి 1:20,21.

కన్య మరియతో ***"ఇదిగో నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అను పేరు పెట్టుదువు"*** అని దూత సెలవిచ్చెను. కనుక పాపులను రక్షించుటకు యేసు ఈ లోకమునకు వచ్చెననుట సత్యము. మన పాపముల నుండి మనలను రక్షించే మహా పురుషుడు జన్మించాడు కనుక మనకు పండుగ. అదే క్రిస్మస్ పండుగ.

## క్రిస్మస్ శుభాకాంక్షలు

**మీరు బ్యాంక్ అకౌంట్ ద్వారా చందా పంపవలసిన బ్యాంక్ అకౌంట్ వివరాలు**

| | |
|---|---|
| **Name** | **: K. Joseph** |
| **A/c Number** | **: 10957380353** |
| **Bank** | **: State Bank of India** |
| | **Main Branch, Ongole** |
| **IFSC Code** | **: SBIN0000890** |

మీ చందాను నెట్‌బ్యాంకింగ్ ద్వారానే పంపాలి. చందా పంపిన తర్వాత 9440217726 కి ఫోన్ చేసి చెప్పాలి లేదా మీరు కట్టిన మొత్తము, ట్రాన్‌సాక్షన్ నంబరు మెసేజ్ చెయ్యాలి.

స్త్రీల విభాగము

# యేసు తల్లి మరియ



శ్రీమతి కె. రేచల్ జోసఫ్,
హన్నా ఉమెన్స్ ప్రెసిడెంట్

ప్రపంచములో అనేకమంది స్త్రీలు మరియమ్మ అని పేరు పెట్టుకుంటారు. కారణం ఆమె యేసు ప్రభువుకు తల్లి కావడమే. రక్షకుడు ఈ లోకంలోకి రావడానికి మరియమ్మే కేంద్రబిందువు. ఈమె ఘనురాలైన స్త్రీగా ప్రపంచ వ్యాప్తంగా కొనియాడబడింది. లోకరక్షకుడు ఈ లోకంలో జన్మించుటకు దేవుడు ఆమెను ఒక సాధనంగా వాడుకున్నాడు. మరియమ్మను దేవుడు ఎన్నుకొనుటకు ఆమెలో ఉన్న శ్రేష్టమైన సద్గుణములను వాక్యము లో నుండి తెలుసుకుందాము.

**దీనురాలు :** "నా ప్రాణము ప్రభువును ఘనపరచుచున్నది. ఆయన తన దీనురాలి దీన స్థితిని కటాక్షించెను" లూకా 1:46. దేవుడు మరియను ఎన్నుకొనుటకు మొదటి కారణం ఆమెలోని దీనత్వం. ఆమె మాటలలో దీనత్వం, ఆమె సమస్త నడవడికలో దీనత్వము. హృదయములను పరిశోధించు దేవుడు మరియలోని దీనత్వమును గమనించి ఆమెను ఎన్నుకున్నాడు. "ఆయన దీనులను ఉన్నత స్థలములలో ఉంచును" యోబు 5:11. దేవుడు మనలను వాడుకొని మన ద్వారా గొప్పకార్యాలు చేయించాలంటే మొదట మనలో దీనమనస్సు ఉండాలి. మరియమ్మ లోకరక్షకునికి తల్లి కాబోతున్నానని ఎరిగియు తన దీనస్థితిని గుర్తుంచుకున్నది. అందువలన ప్రభువు ఆమెను జ్ఞాపకముంచు కొనెను.

**పరిశుద్ధురాలు :** దేవుడు మరియను ఎన్నుకొనుటకు రెండవ కారణము ఆమెలోని పరిశుద్ధ జీవితం.

క్రొత్తనిబంధన కాలానికి దాదాపుగా 400 సం॥లు దేవుని వాక్కు ప్రత్యక్షత లేదు, ప్రవక్తలు లేరు. అయినప్పటికి మరియమ్మ దేవుని వాక్యం ప్రకారం తన పరిశుద్ధతను జాగ్రత్తగా కాపాడుకున్నది. యౌవనులు దేని చేత తమ నడత శుద్ధిపరచుకొందురు? నీ వాక్యమును బట్టి దానిని జాగ్రత్తగా చూచుకొనుట చేతనే గదా? కీర్తనలు 119:9 మరియకు దేవుని వాక్యము తెలుసు, దానిని అనుస రించడమూ తెలుసు.

మరియ కన్యక. ఆమె పురుషుని ఎరుగనిది. ఆమె తన కన్యత్వమును కాపాడుకొనినది. మరియ పరిశుద్ధత కలిగి జీవించుటకు తన్ను తాను దేవునికి సమర్పించుకొనినది. అందువలన దేవుడు ఆమె గర్భవాసములో నుండి ఈ లోకానికి రావడానికి ఇష్టపడ్డాడు.

**విధేయురాలు :** "ఇదిగో ప్రభువు దాసురాలను. నీ మాట చొప్పున నాకు జరుగును గాక! అనెను" లూకా 1:36. దేవుని దూత నీవు గర్భము ధరింతువని చెప్పినప్పుడు, అయ్యో, నేను కన్యకను నేనీ నిందను భరించలేనని ఎదురు తిరుగక దేవుని చిత్తమునకు అప్పగించుకొని విధేయత చూపెను. కన్య మరియ జీవించిన దినములలో ధర్మశాస్త్ర ప్రకారము అవివాహిత గర్భము ధరించినచో ఆమెను రాళ్ళతో కొట్టి చంపుతారు. కన్య మరియ కూడా అవివాహిత. అంతటి సంక్లిష్ట పరిస్థితులలో ఉండి కూడా "నీ చిత్తము చొప్పున జరుగును గాక'' అని విధేయత చూపింది. ఘనతకు ముందు వినయముండును. సామెతలు 18:12.

దేవుని ద్వారా కృప పొందిన మరియమ్మ, లోకరక్షకునిమనకు అందించుటకు ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నది. వివాహం కాకమునుపే గర్భం దాల్చడం సమాజంలో అవమానాలను ఎదుర్కొనే పరిస్థితి. ఎంత గడ్డు పరిస్థితి అంటే నీతిమంతునిగా చెప్పబడిన యోసేపు ఆమెను విడనాడాలి అనుకున్నాడు. ఆమె ప్రవర్తనను సందేహిం

చాడు. ఈ పరిస్థితి మరియమ్మ ముందుగానే గ్రహించి యుండవచ్చు అయినప్పటికి దేవుని చిత్తము నేరవేర్చుటకు తనను తాను ఆమె దేవునికి అప్పగించుకున్నది.

**ప్రార్థనాపరురాలు:** ఆ దూత లోపలికి వచ్చి ఆమెను చూచి ''దయాప్రాప్తురాలా! నీకు శుభము. ప్రభువు నీకు తోడైయున్నాడని చెప్పెను. లూకా 1:28. ఆమె ఒంటరిగా ప్రార్థిస్తున్నప్పుడు దేవుని దూత కనిపించి దేవుని తలంపులను బయలుపరచెను. మనము దైవ సన్నిధిలో కనిపెట్టినప్పుడు ప్రభువు తన ఉద్దేశాలు, తలంపులు ఆయన చిత్తాన్ని బయలుపరుస్తాడు. గబ్రియేలు దూత మరియ దగ్గరకు వెళ్ళి "దేవుని వలన నీవు కృప పొందితివి" లూకా 1:30 అని చెప్పాడు. దేవదూతలను మనం ఎప్పుడు కలుసుకుంటాం? దేవుని సన్నిధిలో మనం ఎక్కువ సమయం గడిపినప్పుడు మాత్రమే వారిని కలుసుకుంటాం. దేవుని చిత్తము దేవుని ఆలోచనలు బయలుపరచబడాలంటే ఎక్కువ సమయం దేవుని సన్నిధిలో గడపాలి. మరియమ్మ దేవుని సన్నిధిలో గంటలు తరబడి గడుపుచు దేవదూతలతో సంభాషించి ఉండవచ్చును.

మరియమ్మ జీవితం అందరికీ విశేషించి మహిళా మణులకు ఆదర్శంగా ఉండాలి. దేవుని చిత్తము జరిగించినంత మాత్రాన ఈ లోకంలో శ్రమలు రావు అని అనుకోకూడదు. మరియమ్మ దేవుని చిత్తాన్ని నేరవేర్చుటకు చాలా కష్టాలు ఎదుర్కొంది. చలికాలంలో నిండుచూలాలు ప్రయాణం చేయవలసి వచ్చింది. చివరికి గది కూడ లేక పశువుల పాకలో ప్రసవించాల్సి వచ్చింది. కాబట్టి లోకంలో ఉన్న మనకు శ్రమలు సర్వసాధారణం ఎందుకంటే లోకం ఎల్లప్పుడు దేవుని చిత్తానికి వ్యతిరేకంగా ఆశిస్తుంది. కాబట్టి మనం కూడ మరియమ్మ వలె ధైర్యం కల్గి దేవుని చిత్తాన్ని నెరవేరుద్దాం. అప్పుడు మన కుటుంబాలు మన జీవితాలు ఆశీర్వాదకరంగా ఉంటాయి. మరియమ్మ వలె దీనులమై, పరిశుద్ధులమై, విధేయులమై, ప్రార్థనాపరులమై ప్రభువుని వెంబడించి ప్రభువుకు ప్రియ బిడ్డలముగా జీవించి ఆయన పరమ రాజ్యమును పొందుకొనుమని ప్రేమతో మనవి చేయుచున్నాను. దేవుడు మిమ్ములను దీవించును గాక!

# చరిత్ర లో క్రిస్మస్

డిసెంబర్ 25న చాలా దేశాలలో క్రిస్మస్ వేడుకలు జరుగుతాయి. డిసెంబర్ మాసం అనగానే ఒక పండగ వాతావరణం కనిపిస్తుంది. ఏ చర్చ్‌కి వెళ్ళిన పిల్లల దగ్గర నుండి పెద్ద వయసు వారి దాకా క్రిస్మస్ సెలబ్రేషన్స్‌లో మునిగిపోయి ఉంటారు. క్రైస్తవ జీవితాలలో భాగమైన క్రిస్మస్ గురించి కొన్ని విషయాలు తెలుసుకుందాం!

1) Christamasలో Christ అంటే క్రీస్తు, mas అంటే ఆరాధన. కాబట్టి క్రిస్మస్ అంటే క్రీస్తును ఆరాధించటం అని అర్థం. కొన్నిసార్లు క్రిస్‌మస్‌ని X-mas అని కూడ అంటారు. చాలామంది క్రిస్మస్ ను X-mas గా వ్రాయడం తప్పుగా భావిస్తారు కాని గ్రీకులో X అంటే క్రీస్తు అని అర్థం.

2) క్రీస్తు పుట్టిన తేదీని గురించి రకరకాల భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికి ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది డిసెంబర్ 25న క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటారు.

3) క్రీస్తు శకారంభంలో చాలా రోజులు క్రిస్మస్ వేడుకలు జరుగలేదు. అయితే క్రీస్తు పుట్టిన రోజున జరిగిన అనేక సమావేశాలలో మత పెద్దలు, అప్పటి సంఘ నాయకులు కలిసి డిసెంబర్ 25ను క్రీస్తు పుట్టినరోజుగా నిర్ధారించారు. అయితే కొంతమంది రోమా పౌరులు, యూదులు, ఆ శతాబ్దపు క్రైస్తవులు దీనిని అంగీకరించలేదు కారణం రోమీయులు దేవునిగా భావించే సూర్యుని కొడుకు పుట్టిన రోజు డిసెంబర్ 25 కావడమే.

4) మొదటిసారిగా 4వ శతాబ్దంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి

5) కాన్‌స్టంటైన్ రోమా చక్రవర్తిగా ఉండగా క్రీ.శ 336 డిసెంబర్ 25న మొట్టమొదటి క్రిస్మస్ జరిగినట్లు చరిత్ర చెప్తుంది. కాన్‌స్టంటైన్ నోపుల్ మొదటి క్రైస్తవ రోమా చక్రవర్తి

6) 4వ శతాబ్దకాలంలో సెయింట్ నికోలస్ అనే ధనికుడు కష్టాలలో ఉన్నవారికి రహస్యంగా సహాయం చేసేవాడు. నికోలస్ ఉదారత్వానికి గుర్తుగా క్రిస్మస్ రోజున గిఫ్ట్స్ ఇవ్వడం పేద వారికి సాయం చేయడం ఒక వాడుకగా మారింది. ఈ సెయింట్ నికోలస్ ఎవరో కాదు, పిల్లలకు ఎంతో ఇష్టమైన శాంటాక్లాజ్.



బ్రదర్ కె.సామ్రాట్

16

# మదర్‌తెరీసా

క్రీస్తుశకం 1204 సంవత్సరము ఇప్పటికి 805 సం॥ల క్రితం ఇటలీలోని అస్సిసీ అనే పట్టణంలో జరిగిన సంఘటన మనందరం తెలుసుకొనుటకు దేవుని కృపయై యున్నది. సెయింట్ ఫ్రాన్సిస్ ఆఫ్ ఆస్సీస్ (1182- 1226) జీవిత చరిత్రను మదర్ తెరీసా తన పన్నెండు ఏళ్ళ ప్రాయంలో చదివి ఎంతో ఉత్తేజపరచబడినది. మదర్ తెరీసా తన జీవితంలో సెయింట్ ఫ్రాన్సిస్‌ను మాదిరిగా మార్గదర్శ కంగా తీసుకున్నారు. తండ్రి శరీర సంబంధ సుఖభోగాలు కల్పిస్తే తల్లి దేవుని యెడల ఆత్మసంబంధమైన విశ్వాసమును కలిగించింది. 1202 సం॥లో ఫ్రాన్సిస్ తన 19వ యేట యుద్ధంలో పాల్గొని బందీగా చెరపట్టబడిన సం॥ము తరువాత జబ్బుపడి విడుదల పొంది అస్సీసీ పట్టణానికి తిరిగి వచ్చాడు. జబ్బు నుండి స్వస్థతపడి యుద్ధంలో పాల్గొనటానికి వెళ్తూ మరొకసారి మార్గంలో జబ్బుపడ్డాడు. రాత్రి సమయంలో ప్రభువు స్వరము విన్నాడు. 'ప్రభువా, నన్నేమి చేయమంటావ'ని అడిగాడు. ఆ స్వరము 'ఇంటికి వెళ్ళు నీవేమి చేయవలెనో బోధించెదను' అని చెప్పినప్పుడు తన ఖరీదైన యుద్ధపరికర ములను ఒక పేద సైనికునికి ఇచ్చి అస్సీసికి తిరిగి వచ్చాడు. పేదలైన నిర్భాగ్యుల పట్ల దయకలిగి వారి సేవ మొదలుపెట్టాడు. 1206లో 24 సం॥ల వయస్సులో సెయింట్ డొమియన్ చర్చీలో సిలువ ముందు ప్రార్థిస్తుండగా దేవుని స్వరము మాట్లాడి 'ఫ్రాన్సిస్, నా యిల్లు పడిపోయి పాడైపోవు చున్నది. నీవు బాగుచెయ్యి' అన్నప్పుడు వెంటనే ఆ పనిలో నిమగ్నమయ్యాడు. తండ్రికి ఇవన్నీ నచ్చక అతన్ని ఇంట్లో నిర్భంధించి, బిషప్ ఎదుట తన కుమారుని విడనాడుచున్నట్లు ప్రకటించినప్పుడు ఫ్రాన్సిస్ కూడా తన కుమారత్వమును వదలుకొని తన తండ్రి డబ్బును, తన శరీముపై బట్టలను తండ్రికి ఇచ్చివేసి సెయింట్ డొమియన్ చర్చి గురువు వద్ద నివసించెను. సువార్త యెడల పిచ్చి పట్టినవాడై ప్రభువు సేవలో పరమతండ్రి చిత్తానుసారము తాను అతి సాత్వీకునిగా ఉండగోరినట్లు తీర్మానించుకొనినాడు.

ఫ్రాన్సిస్ చిన్నతనములో కుష్ఠ వ్యాధిగ్రస్తుల గురించి విన్నాడు. కుష్ఠరోగమనునది శాపమనేవారు. జనుల మధ్యకు వస్తే ఆ వ్యాధి వేరొకరికి అంటుతుందని భయభ్రాంతులతో నుండెడివారు. ప్రపంచంలోని బంగారమంతా ఇస్తామన్నా ఒక కుష్ఠ వాడిని తాకడానికి కూడా ఇష్టపడని రోజులివి. కాని ఒకానొక రోజు ఫ్రాన్సిస్‌కు ఒక కుష్ఠరోగి ఎదురవుట తారసపడింది. వెనక్కి తిరిగి పారిపోదామనిపించింది. కాని సాండియానో సిలువ పారిపోకుండా నిరోధించింది. ఆ కుష్ఠరోగి చింపి గుడ్డలు వేసుకొని నెమ్మదిగా వస్తూ బ్యాండేజి కట్టిన చేతులను అడ్డుగా పెట్టుకొని విచారంతో కూడిన నమ్రతతో తీయని చూపు చూస్తూ తన వద్దకు రావద్దని అంటున్నాడు. అప్పుడు ఫ్రాన్సిస్‌కు సాండియానో చర్చిలోని సిలువ గుర్తుకు వచ్చింది. ఆ సిలువపై యేసయ్య కళ్ళే కుష్ఠరోగలో ఉండి తనను చూస్తున్నట్లు అనిపించింది. అప్పుడు ఫ్రాన్సిస్‌ను ఏమి అధిగమించిందో తెలియదు కాని ఒక్క గంతు వేసి కుష్ఠరోగిని వాటేసుకొని వాని నోటిపై ముద్దు పెట్టుకున్నాడు. ఇద్దరూ ఒకరిని చూసి ఇంకొకరు ఏడుస్తూ సంతోషానందాలతో గడిపారు. ఫ్రాన్సిస్ జేబుల్లో ఉన్నదంతా తీసి ఆ కుష్ఠరోగికి ఇచ్చివేశాడు. కుష్ఠరోగి ద్వారా తాను చవిచూసి అనుభవించిన ఆనందంతో పోలిస్తే తను ఇచ్చింది ఏమీ లేనట్లే అనుకున్నాడు. దేవుడు ప్రేమించిన పేదరికాన్ని తాను ప్రేమిస్తున్నట్లు తెలిసింది.

కన్నీటిలో కడగబడిన ముత్యముల వంటి కళ్ళు,

వాటిలో దాగి గుప్తయైయున్న మర్మము చాలా మందికి తెలియదు. ఇప్పటి వరకు ఫ్రాన్సిస్ ఉద్దేశములో పేదరికము భూమి యొక్క ఒక శాపము, సృష్టిలోని భయంకరమైన తప్పిదము, దేవుడు మరచిన ఒక భాగము. కాని ఇప్పుడు వేరొక విధంగా బోధపడింది. శాపము పేదరికంలో లేదు గాని ఐశ్వర్యమందున్నది. శాపము అధికారములో ఉండి హృదయాన్ని విషముతో నింపుచున్నది. పేదరికమనేది సృష్టి తప్పిదము కాదు గాని అది సృష్టిలోని ఆఖరి పుట అయివున్నది. పేదరిక మనునది బహు ముఖ్యమైన రహస్యమునైయున్నది. అది దేవునికి మనపై ఉన్న మరపు కాదుగాని మనపై ఆయనకున్న నిజమైన ప్రేమ. మన అంతరంగ లోతుల్లో దాగియుండిన నిజమైన ప్రేమ, నగ్నమైన విశ్వాసాలను ప్రభువు త్రవ్వి తీసుకొనుటకు ఉపయోగించే సాధనమే పేదరికము. మనుష్యుల గొంతు పట్టుకొని వారు పుట్టిన దినాన్ని శపించేది కాదు గాని, తల్లి గర్భమై వుండి ఆయన రాజ్యానికి పుట్టక నిచ్చేదిగా పేదరికం వుంది. పేదరికమనేది దేవుడు నివసించే ప్రదేశమైయున్నది. నిజమైన ప్రేమకు పాఠశాల పేదరికము. పేదరికము కరుణను దేవుని వద్దనుండి పొందే గొప్ప శక్తి మరియు ఆయనను ఎదుర్కొనే సులువైన మార్గము ఈ లోకాన్ని దాటే ఖచ్చితమైన దారి. ఫ్రాన్సిస్‌గారు తనలోనున్న భయాన్ని పోగొట్టుకొని నిజమైన విడుదలను అనుభవ పూర్వకముగా పొందినారు. సెయింట్ ఫ్రాన్సిస్ గారి జీవితం ద్వారా మదర్ ఎంతగానో ప్రభావితం చేయబడినారు. అందుచేతనే పేదరికాన్ని ప్రేమించడానికి, నిర్భాగ్యులను ప్రేమించడం దేవుని ప్రేమించడమే అని భావించింది.

1957వ సం॥లో ఐదుగురు కుష్ఠు రోగస్తులు మదర్ హౌస్ ముందు నిలుచున్నారు. లోక దూషణను అనుభవించిన ప్రభువు అభ్యర్ధన తన ముందుకు వచ్చినట్లు మదర్ తెలుసుకున్నారు. ప్రపంచములో ఒక కోటి ఇరవై లక్షలమంది కుష్ఠు వ్యాధిగ్రస్తులుంటే, మూడవ వంతైన నలభై లక్షల మంది భారతదేశంలో ఉన్నారు. కొందరి అంచనాల ప్రకారం కలకత్తాలోనే ముప్పైవేల మంది కుష్ఠు రోగులున్నట్లు లెక్కవేయబడింది. బైబిలు కాలము నుండి ఫ్రాన్సిస్ కాలము వరకు ప్రపంచమంతా వున్న కుష్ఠు వ్యాధి 18వ శతాబ్దానికి యూరప్, ఉత్తర అమెరికాల్లో నిర్మూలించ బడింది. పేద ఆఫ్రికా, ఆసియా దేశాల్లో మాత్రం తిష్ట వేసుకుని నివాసముంటుంది.

కుష్ఠు వ్యాధి సోకిన వారి నాడీ మండలం దెబ్బతిని ఆ ప్రాంతంలో స్పర్శ జ్ఞానం పోతుంది. అవయవాలకు దెబ్బ తగిలినను స్పర్శ వుండదు. నరాలు దెబ్బతినడంతో కాళ్ళు, చేతులు, ముక్కు కొరుక్కుపోయి ఆకారం లేకుండా అవుతాయి. అసలే పేదరికం. అందునా కుష్ఠువ్యాధి. ప్రజల్లో విముఖత. వీరికి వైద్య సహాయం ఉండటం చాలా కష్టమైనదిగా ఉండి రోజురోజుకు వారి జీవితం దుర్భరమవుతుంది. ఈ దుర్భర జీవితాల్లో వెలుగు నింపాలని మదర్ తెరీసా నిశ్చయించుకున్నారు. దేవుని శాపానికి గురైన వారు మాత్రమే ఈ వ్యాధికి గురి కాబడతారని మొదటి నుండి వున్న నానుడి. జాగ్రత్తలు తీసుకోకుంటే కుష్ఠు వ్యాధి ఇతరులకు సోకుతుంది. అందుకే వారికి జనజీవనానికి దూరంగా ఉంచాలని ప్రజలు కోరుకుంటారు. కుష్ఠు వ్యాధిగ్రస్తులు పనిచేయడానికి వీలులేదు గనుక వారికి డబ్బు వుండదు. అడుక్కుతినే పరిస్థితికి దారితీస్తుంది. వారి శారీరక దుస్థితే కాక మానసిక వ్యధ, ఒంటరితనం వారిని మరీ కృంగదీస్తుంది. ఈ పరిస్థితిలో వారికి చికిత్స సదుపాయంతో పాటు, వాళ్ళు కూడా మానవులే దేవుని స్వరూపములో ఉన్నవారు, దేవుని దృష్టికి విలువైన వారు అనే ఆలోచన వారికి కలిగించాలి. ఈ కుష్ఠురోగస్తులు చాలా అందమైన ప్రజలని మదర్ తెరీసా భావన. వారికి కుష్ఠు వ్యాధి వచ్చిందంటే అది దేవుని కానుకైయున్నది. దాని ద్వారా వారు దేవునికి దగ్గరయ్యే సులువైన మార్గము. కనుక ఈ కుష్ఠు రోగులకు దగ్గరగా తాను, తన సిస్టర్స్, బ్రదర్స్ వెళ్ళి, వారిలో వున్న అనుమానము, హృదయములో వున్న నొప్పిని తొలగించాలి. వారిలో ఆత్మస్థైర్యము, సంతోషాన్ని, బలాన్ని నింపాలని మదర్ తెరీసా ఆశించారు. వారికి భోజన, చికిత్స సదుపాయము చేయాలని నిశ్చయించారు.

కుష్ఠు అనేది ఇతర జబ్బులవలె ఇది కూడా ఒక వ్యాధే. దేవుడు ఈ వ్యాధి ద్వారా వారిని దగ్గరకు చేర్చుకొనుటకై ఉద్దేశించినాడు. అందుకే వీరు మరి ఎక్కువగా దేవుని ప్రార్థించి

**మిగితాది 19వ పేజీలో**

## నిజ క్రిస్మస్

మన ఇంట్లో కుటుంబ సభ్యులలో ఎవరి పుట్టిన రోజు వచ్చినా, ఆ రోజంతా వారిని సంతోషపెట్టాలని వారికి ఇష్టమైనవన్నీ చేస్తాము కదా! అయితే యేసుక్రీస్తు పుట్టిన రోజైన క్రిస్మస్ రోజు మనం యేసుక్రీస్తు కొరకు ఏం చేస్తున్నాము? ఆయనను ఎంతవరకు సంతోషపెడుతున్నాము? మనం అతిగా ప్రేమించే మన కుటుంబ సభ్యులు ఈ లోకంలో లేక పోయినా సరే, వారి జన్మదినమును పురస్కరించుకొని అనేక కార్యక్రమాలు చేస్తాము. అన్నదానాలని, రక్తదానాలని, పేదలకు బట్టలు ఇవ్వటంలాంటి కార్యక్రమాలు చాలామంది చేస్తారు. ఎందుకంటే వారిపట్ల చూపించే ప్రేమకు నిదర్శనంగా ఇవన్నీ చేస్తారు. అయితే యేసు పుట్టిన రోజైన క్రిస్మస్ సందర్భంగా మనం ఇతరులకి ఏం చేస్తున్నాము అన్నదాన్నిబట్టి మనం యేసుని ఎంత ప్రేమిస్తున్నామో అర్ధమవుతుంది. మత్తయి 25:35-40 చూచినట్లయితే మిక్కిలి అల్పులైన వారికి నీవు ఏమి చేసినా అది దేవునికి చేసినట్లే. మరి ఈ క్రిస్మస్ రోజున క్రొత్త బట్టలు ధరించి, ఇంటిని అలంకరించుకొని, పిండివంటలు, బిరియానీలు చేసుకొని, బంధువులతో, స్నేహితులతో నీవు మాత్రమే సంతోషంగా ఉండాలను కుంటున్నావా? యేసు పుట్టిన రోజున ఆయనను సంతోషపరచాలని అనుకుంటున్నావా? అయితే నీకు తెలిసిన పేదవారిలో కనీసం ఒక్కరికైనా క్రొత్త బట్టలు, పిండివంటలు, బిరియాని వారికిచ్చి వారితో ఆనందించిన యెడల యేసుప్రభువుకు నిజమైన జన్మదిన వేడుక అవుతుంది. అది ఆయన మీద నీకున్న ప్రేమనుబట్టి నిర్ధారించబడుతుంది. యేసు పుట్టిన రోజున ఆయనకు ఇష్టమైనవి చేసి ఆయనను సంతోషపెట్టినప్పుడు మాత్రమే అది నిజ క్రిస్మస్ అవుతుంది.

**“మిక్కిలి అల్పులైన యీ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకు చేసితిరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను” మత్తయి 25:40.**

**క్రిస్మస్ శుభాకాంక్షలు**

## బైబిల్లో క్రీస్తు పుట్టుక

పరిశుద్ధత పాఠకులకు క్రిస్మస్ శుభాకాంక్షలు. ఈ సందర్భంగా పరిశుద్ధ గ్రంథమైన బైబిల్లో యేసుక్రీస్తు పుట్టుక గురించి ప్రవచనాత్మకంగా చెప్పబడింది. అవి బైబిల్లో ఏ ఏ భాగాలలో చెప్పబడిందో మా పాఠకులు తెలుసుకోవాలని ఆశిస్తున్నాం. బైబిల్ మొత్తం మీద ఏడు వచనాలలో క్రీస్తు పుట్టుక గురించి చెప్పబడింది. ఆ ఏడు వచనాలేంటో చూద్దామా.

1. ***కాబట్టి ప్రభువు తానే యొక సూచన మీకు చూపును. ఆలకించుడి, కన్యక గర్భవతియై కుమారుని కని అతనికి ఇమ్మానుయేలను పేరు పెట్టును.*** యెషయా 7:14

2. ***ఏలయనగా మనకు శిశువు పుట్టెను మనకు కుమారుడు అనుగ్రహింపబడెను ఆయన భుజము మీద రాజ్యభారము ండును. ఆశ్చర్యకరుడు ఆలోచనకర్త బలవంతుడైన దేవుడు నిత్యుడగు తండ్రి సమాధానకర్తయగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడును.*** యెషయా 9:6

3. ***బేత్లెహేము ఎఫ్రాతా, యూదావారి కుటుంబములలో నీవు స్వల్ప గ్రామమైనను నా కొరకు ఇశ్రాయేలీయులను ఏలబోవువాడు నీలో నుండి వచ్చును.*** మీకా 5:2

4. ***ఇదిగో ప్రభువు దూత స్వప్నమందు అతనికి ప్రత్యక్షమై-దావీదు కుమారుడవైన యోసేపూ, నీ భార్యయైన మరియను చేర్చుకొనుటకు భయపడకుము, ఆమె గర్భము ధరించినది పరిశుద్ధాత్మ వలన కలిగినది; ఆమె యొక కుమారుని కనును; తన ప్రజలను వారి పాపముల నుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టుదువనెను.*** మత్తయి 1:20-21

5. *తన తొలిచూలు కుమారుని కని, పొత్తిగుడ్డలతో చుట్టి, సత్రములో వారికి స్థలములేనందున ఆయనను పశువుల తొట్టిలో పరుండబెట్టిరి. లూకా 2:7*

6. *అయితే ఆ దూత-భయపడకుడి; ఇదిగో ప్రజలందరికిని కలుగబోవు మహా సంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియజేయుచున్నాను; దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీకొరకు పుట్టియున్నాడు; ఈయన ప్రభువైన క్రీస్తు.* లూకా 2:10-11

7. ***ఇదిగో తూర్పు దేశపు జ్ఞానులు యెరూషలేమునకు వచ్చి-యూదుల రాజుగా పుట్టిన వాడెక్కడ నున్నాడు? తూర్పుదిక్కున మేము ఆయన నక్షత్రము చూచి, ఆయన పూజింప వచ్చితిమని చెప్పిరి.*** మత్తయి 2:1-2

# దేవుడు - సిరి

23

పాతనిబంధనలోని సంఘటనలను యేసుప్రభువు ఈ లోకములో తన సేవాకార్యక్రమములో ఉపయోగించాడు. అన్నిటికంటెముందు – సారెపతు విధవరాలిని గురించి తను పెరిగిన నజరేతు గ్రామములో ప్రస్తావించారు. యేసు ప్రభువు నోటనుండి ఒక స్త్రీని గురించి పలుకరించబడటం గొప్ప భాగ్యం కాదా?

ఏలియా దినములయందు మూడేండ్ల ఆరునెలలు ఆకాశము మూయబడి, దేశమందంతటను గొప్ప కరువు సంభవించినపుడు ఇశ్రాయేలులో అనేకమంది విధవరాండ్రు ఉండినను, ఏలియా – సీదోనులోని సారెపతు అను ఊరిలో ఉన్న ఒక విధవరాలి యొద్దకే గాని, మరి ఎవని యొద్దకును పంపబడలేదు.

ఏలియా ఆమె యొద్దకు యెహోవా దేవునిచే పంప బడ్డాడు. 'నీవు సీదోను పట్టణ సంబంధమైన సారెపతు అను ఊరికిపోయి అచ్చట ఉండుము. నిన్ను పోషించుటకు అచ్చటనున్న యొక విధవరాలికి సెలవిచ్చియున్నాను' అన్నాడు. ఈమె ఎంత ధన్యురాలు? బీద విధవరాలు తినటానికి ఇంట్లో పట్టెడు పిండి మాత్రం ఉంది. కట్టెలు లేవు. ఒక కుమారుడు. పలుకుబడి లేదు. బంధువులు లేరు. ఈ స్థితిలో ఉన్న ఒక క్రైస్తవురాలిని పలుకరించండి – దేవుని మీద ఎన్ని నేరాలు చెబుతుంది? బీద, బీద అనే మాట ఎందరి నోట్లోనుండి బయటకు వస్తుంది? ఎంతమంది బీద సేవకుడనని, నాది బీద సంఘము అని అంటారు?

విత్తనాలు నేలలో వేయకుండా చెట్లు ఎలా వస్తాయి? నీరుపోయకుండా చెట్లు ఎలా ఎదుగుతాయి? ఏమి చేయకుండా కాయలకోసం ఎదురుచూస్తే తప్పు దేవునిదా?

ఆమె యెహోవా దేవుని నామమును ఎరిగినది కనుక ఏలియాతో – రూపం, వేషం చూసి, 'నీ దేవుడైన యెహోవా జీవము తోడు' అన్నది. ఇశ్రాయేలీయులలో కొన్ని లక్షల మంది విధవరాండ్రు భక్తిగలవారు ఉన్నారు. అయితే సారెపతు విధవరాలు ఇతరులకు సహాయముచేసే విషయములోను, తన ఆహారమును (నీ ఆహారమును ఆకలిగొనినవారికి పెట్టుటయు యెషయా 58:7) ఇతరులకు పెట్టటం అలవాటుగా చేసు కొన్నది. అందువలన కరువులో ఏలియా ఒక్కడే పోషించబడటం గొప్పకాదు గాని అతనితో పాటుగా మరియొకరు – ఆమెకూడా ఆహారం పొందటం గొప్పకాదా? నిజానికి దేవుడు ఏలియా కొరకు ఆమె యొద్దకు పంపలేదు కాని, ఆమెను పోషించటానికి ఏలియాను ఆమె యొద్దకు పంపాడు.

అంత మంది ఇశ్రాయేలు ప్రజలు కరువుతో అల్లాడుతుండగా దేవుని నుండి సాయంపొందినది ఏలీయా కాక సారెపతు విధవరాలు మాత్రమే. కారణం ఆమె అన్యురాలైనప్పటికి దేవుని నామాన్ని ఎరిగినది. అంతేకాదు దేవున్ని బట్టి తన దగ్గరున్న చివరి అప్పాన్ని దేవుని సేవకునికి ఇవ్వడానికి ఇష్టపడింది. ఫలితంగా ఇంచుమించు మూడన్నర సం॥ము పోషించబడింది.

కాబట్టి మనందరం ఆమె వలె దేవున్ని బట్టి ధైర్యం కలిగి తోటివారి అవసరతలు తీర్చుటకు సహాయపడదాము. కేవలం కలిమిలోనే కాక లేమిడిలోను తోటివారికి సహాయ పడదాం. ఈ క్రిస్మస్ సమయంలో దేవుడు నీ నుండి కోరునది అదియే. "**న్యాయముగా నడుచుకొనుటయు కనికరమును ప్రేమించుటయు, దీనమనస్సు కలిగి నీ దేవుని యెదుట ప్రవర్తించుటయు ఇంతేగదా యెహోవా నిన్ను అడుగు చున్నాడు.** మీకా 6:8

నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించుము అన్న దేవుని ఆజ్ఞను మనఃపూర్వకముగా పాటించి ఆ దేవ దేవుని దీవెనలు పొందుకుందాం. **వెదజల్లి అభివృద్ధి పొందువారు కలరు. తగిన దానికన్న తక్కువ ఇచ్చి లేమికి వచ్చువారు కలరు.** సామె 11:24

# గొర్రెల కాపరులు

యేసు జన్మించుటకు ఏడు శతాబ్దాలకు ముందే ప్రవక్తయైన మీకా– ఆయన బేత్లెహేములో జన్మిస్తాడని ప్రవచించాడు. నజరేతు వారైన మరియమ్మ, యోసేపులు ప్రధానం చేయబడిన తర్వాత వారు నజరేతులో కాపురము న్నట్లయితే ఈ ప్రవచనము ఎలా నెరవేరుతుంది?

రోమా పట్టణంలో వున్న అగస్టస్ సీజర్ చక్రవర్తి తన సామ్రాజ్యమంతటిలో జనాభా లెక్క సేకరించవలసినదని ఆదేశించాడు. కాని జనాభా లెక్కకు యూదులు వ్యతిరేకులై నందువలన, యూదయలో జనాభా లెక్కలు సేకరించటానికి సంకోచించారు. నాటి ప్రపంచమంతటను ఈ పని జరిగింది. యోసేపు దేవదూత ద్వారా కలలో చెప్పబడిన ప్రకారము మరియమ్మను తన ఇంట చేర్చుకున్నాడు.



జనాభా లెక్క పురుషులకేగాని స్త్రీలకు కాదు. కనుక యోసేపు ఒక్కడే యూదయ లోని బేత్లెహేమునకు వెళ్ళి జనసంఖ్యలో పాల్గొని నజరేతు రావచ్చును. కాని మరియ మీద నజరేతులో రేగిన దుమారం, నిందను భరించలేక ఇక ఎన్నటికిని నజరేతు రాకుండా బేత్లెహేములోనే కాపురముండ వలెనని జనాభా లెక్కలో పాల్గొనుటకు మరియతో కలసి బేత్లె హేము వచ్చి సత్రంలో నివాసం చేశాడు. వారు బేత్లెహేములో ఉన్నప్పుడు ఆమె ప్రసవ దినములు నిండినవి. ఆమె ప్రసవించటానికి సత్రంలో స్థలం లేనందున పశులపాక శుభ్రం చేస్తే, మరియ పశులపాకలో పురుడు పోసికొన్నది.


బేత్లెహేము గ్రామం యెరూషలేముకు ఆరు మైళ్ళ దూరంలో దక్షిణంగా ఉన్నది. యెరూషలేము దేవాలయంలో ఉదయ సాయంకాల బలి అర్పణ కార్యక్రమము కొరకైతేనేమి, దేవాల యములో ప్రతినిత్యం అర్పించబడు అనేక రకాలైన బలులకు కావలసిన పశువులు, గొర్రెలు, మేకలు మాజీ ప్రధాన యాజ కుడు, నాటి ప్రధాన యాజకుడైన కయప మామ అయిన అన్నా ద్వారా నడిపించబడుచున్న 'అన్నాబజారు'లని పిలువబడు గొర్రెల వ్యాపారం మూడుపువ్వులు ఆరు కాయలుగా నడిపించ బడుతుంది.

దేవాలయమునకు సంబంధించిన పశువులను బేత్లెహేము, యెరూషలేమునకు మధ్యనున్న పొలములలో యౌవనులైన యాజకులు లేక వేదాంత విద్యార్థులు ఈ పశువులను రాత్రి జామున పొలములో కాపు కాసేవారు. ఈ పశువుల మందలు ఎన్ని ఉన్నాయో మనకు తెలియదు కానీ, ఒక గుంపు వారి యొద్దకు మాత్రము ప్రభువు దూత పంపబడినాడు. అంతేకాదు మహిమ వారి చుట్టూ ప్రకాశించింది. ప్రభువు మహిమ వారి యొద్దకు వచ్చిందంటే అది చిన్న విషయం కాదు. ఈ పశువుల కాపరులు మనము చెప్పుకుంటున్నట్లు వెర్రివారు కారు. విద్యాహీనులు కారు. అటువంటి వారి యొద్ద ప్రభువు మహిమ ప్రకాశించదు.

ప్రభువు మహిమ, షకినా మేఘము, మోషే ప్రత్యక్షపు గుడారము పని పూర్తి చేసిన తర్వాత ఈ మహిమ ప్రత్యక్షపు గుడారమును కమ్మగా యెహోవా తేజస్సు మందిరమును నిండెను. ఆ మేఘము మందిరము మీద నిలుచుట చేత మందిరము యెహోవా తేజస్సుతో నిండెను గనుక మోషే ప్రత్యక్షపు గుడారములోనికి వెళ్ళలేదు, వెళ్ళలేకుండెను. తరువాత సొలొమోను దేవాలయం కట్టుట పూర్తిచేసి ప్రతిష్ఠించిన తర్వాత ఒక మేఘం యెహోవా మందిరం నిండా నిండెను. యెహోవా తేజస్సుతో దేవుని మందిరం నిండుకొనగా సేవ చేయుటకు యాజకులు ఆ మేఘమున్న చోట నిలువలేకపోయిరి.

ఇప్పుడు ఈ పశువుల కాపరులు యధార్ధంగా మెస్సయ్య కొరకు ఎదురు చూచుచున్న యాజక విద్యార్థులు. లూకా 2:8-20 వరకు చదివినట్లయితే "కొందరు గొఱ్ఱెల కాపరులు పొలములో రాత్రివేళ తమ మందను కాచు కొనుచుండగా" ఇక్కడ గొఱ్ఱెల కాపరులు రాత్రివేళ ఏ గొఱ్ఱెల మందను కాయుచున్నారు? గొఱ్ఱెలను పాపపరిహార్ధబలిగా ఇచ్చేవారు. బలికి అర్పించిన గొఱ్ఱెలను యెరూషలేము, బేత్లెహేము చుట్టుప్రక్కల నుండి తెచ్చిన గొఱ్ఱెలను బేత్లెహేమునందు మేపబడి వాటిని దేవాలయంలో బలి అర్పించాలి. బలి ఇవ్వడానికి సిద్ధమవుతున్న గొఱ్ఱెలను మేపు గొఱ్ఱెల కాపరుల యొద్దకు దేవుని దూత వచ్చి బలి అర్పణగా గొఱ్ఱెలకు బదులుగా దేవుని కుమారుడు మెస్సయ్య పుట్టియున్నాడను సువార్తను తెలియజేసెను. ప్రభువు దూత వారి యొద్దకు వచ్చి నిలిచి "ఇదిగో ప్రజలందరికి కలుగ బోవు మహా సంతోషకరమైన సువార్తమానము నేను మీకు తెలియజేయుచున్నాను. దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు. ఈయన ప్రభువైన క్రీస్తు" అని చెప్పి వారికి ఒక ఆనవాలు ఇచ్చినట్లు చూస్తాము. ఒక శిశువు పొత్తి గుడ్డలతో చుట్టబడి యొక తొట్టిలో పండుకొని యుండుట మీరు చూచెదరు అను ఆనవాలు వారికి ఇచ్చెను. ఈ చిన్న ఆనవాలు పట్టుకొని బేత్లెహేములో ఆ శిశువును వెదకుట చాలా కష్టము. అయితే ఆ గొఱ్ఱెల కాపరులు ప్రభువు దూత మాటలయందు విశ్వాసముంచి, మనము బేత్లెహేము వరకు వెళ్ళుదము రండని యొకనితోనొకడు చెప్పుకొని త్వరగా వెళ్ళి మరియను, యోసేపును, తొట్టిలో పండుకొనియున్న శిశువును చూచిరి. తర్వాత ఈ శిశువును గూర్చి తమతో చెప్పబడిన మాటలు, వారికి దూత ద్వారా చెప్పబడిన మాటలు "నేడు రక్షకుడు మీ కొరకు పుట్టి యున్నాడు" అను సువార్తను ప్రచురము చేసిరి. ప్రభువు దూత ద్వారా తమకు చెప్పబడిన మాటను గొఱ్ఱెల కాపరులు ప్రచురము చేసిరి.


భూమిపై యేసయ్య జననమును గూర్చిన వార్త ప్రచురము చేసిన వారు గొఱ్ఱెల కాపరులు. దేవుడు తన కుమారుని జననమును గూర్చిన వార్త భూమిపై ప్రకటించుటకు అధికారంలో ఉన్నవారికి, విద్యా వంతులకు, ధనికులకు మత నాయకులకు ఇవ్వలేదు. ఈ సువార్తను విన్న మనము కూడా గొఱ్ఱెల కాపరులవలె త్వరగా వెళ్ళి మనకు ఇవ్వబడిన యేసయ్యను గూర్చిన ఆనవాలు – వారికి పొత్తిగుడ్డలతో చుట్టబడిన శిశువు ఒక్కటే ఆనవాలు. అయితే మనకు దేవదూత గొఱ్ఱెలకు చెప్పటం, గొఱ్ఱెల కాపరులు ఆ శిశువును చూడగలగటం తూర్పు దేశమున ఉదయించిన నక్షత్రము, యేసయ్య సిలువ మరణ, పునరుత్థానము ఇవన్నీ ఆనవాళ్ళుగా ఉన్నాయి. ఈ ఆనవాళ్ళ ద్వారా మన హృదయంలో, ఆత్మలో ఆయనను వెదకి మన హృదయాలలో ఆయన పుట్టునట్లుగా దేవుని అడుగుదాం. ఈ సువార్త "మీ కొరకు పుట్టియున్నాడు" అని ప్రచురము చేయుచు అనేక హృదయాలలో యేసు పుట్టునట్లు ప్రకటిద్దాం. ఆచారముగా సంప్రదాయంగా సంవత్సరమునకు ఒక క్రిస్మస్ కాక అనేకమంది హృదయాలలో యేసు పుట్టునట్లు చేసి, హృదయాలలో క్రీస్తు పుట్టినప్పుడల్లా క్రిస్మస్ చేయుచూ అనేక క్రిస్మస్‌లు చేయాలని ఆశిద్దాం. మెస్సయ్య రాక కొరకు ఎదురు చూచు వారికి మెస్సయ్య మీ కొరకు పుట్టియున్నాడని ప్రకటిద్దాం.



# సువర్తమానము

***"ఇదిగో ప్రజలందరికిని కలుగబోవు మహాసంతోషక రమైన సువర్తమానము నేను మీకు తెలియ జేయుచున్నాను. దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టి యున్నాడు. ఈయన ప్రభువైన క్రీస్తు"*** *లూకా 2:10,11*

ఈ వాక్యభాగములో దూత ప్రజలందరూ సంతోషించివ లసిన ఒక మంచి వార్త లేదా సువర్తమానము తెచ్చింది. ఆ వర్తమానము ఏమిటంటే మనకొరకు **రక్షకుడు** పుట్టి యున్నాడు అనునది. యేసుప్రభువు కేవలం క్రైస్తవులకో, లేదా ఇశ్రాయేలు దేశస్థులకో రక్షకుడు కాదు. యేసుప్రభువు **ప్రజలందరికి రక్షకుడు**. ఎవరు అంగీ కరించినా, అంగీకరించకపోయి నప్పటికి **యేసు సర్వ మానవాళికి రక్షకుడు**. చాలామంది యేసుక్రీస్తును దేవునిగా అంగీకరించినా ఆయనను రక్షకుడుగా అంగీకరించరు, ఆయన రక్షణ తమకు అవసరం లేదని అనుకుంటారు. కానీ సర్వ మానవాళికి యేసుప్రభువు ఇచ్చే రక్షణ అత్యవసరం. రక్షకుడు అని ఎవరిని అంటారు? ఆ రక్షకుని అవసరం ఎవరికి ఉందో చూద్దాం.



యేసు అంటే రక్షకుడు అని అర్థం. దేని నుండి ఆయన మనల్ని రక్షిస్తాడు?

***'‘తన ప్రజలను వారి పాపాల నుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అని పేరు పెట్టుదువనెను"***

ప్రజలను వారి పాపాల నుండి రక్షిస్తాడు కాబట్టి ఆయనను రక్షకుడు అన్నారు. పాపాల నుండి ఎందుకు రక్షించాలి అంటే పాపము మనుష్యులను పరిశుద్ధుడైన దేవుని నుండి దూరం చేస్తుంది. కాబట్టి పాపముల నుండి రక్షించబడి దేవుని చేరాలి లేదా పాపం చేయకుండా ఉండాలి. కానీ ఆదాము హవ్వలు దేవుని ఆజ్ఞను మీరి ఈ లోకంలోకి పాపాన్ని ప్రవేశపెట్టారు. వారి అవిధేయత ప్రతి మానవునిలో ప్రవేశించబడింది. జాగ్రత్తగా ఆలోచిస్తే ఎవరికి వారు తాము పాపులము అని గ్రహించగలుగుతారు. ఉదా॥ మనలో ప్రతి ఒక్కరు 'నా ఇష్టం' అని ఏదో ఒక సందర్భం లో వాడుతుంటాం. ఆ వాక్యం ఎప్పుడు వాడతారో ఒక నిమిషం ఆలోచించండి ఎవరైనా మంచి చెప్తే అది మనకు రుచించనప్పుడు చాలా సింపుల్‌గా నా ఇష్టం నీకెందుకు అంటాం కదా! అదే అవిధేయత. మంచిని తిరస్కరించడమే అవిధేయత. కాబట్టి నీవు ఏ కులానికి చెందిన ఏ మతానికి చెందిన వ్యక్తివైనా సరే పాపానికి అతీతుడవు కాదు. ప్రతి ఒక్కరిలో పాపస్వభావం పుట్టుకతోనే ఉంటుంది. చిన్న పిల్లలు సైతం కోపం, అసూయ, కుళ్ళు వంటి లక్ష ణాలను కనపరుస్తారు. వారికేమి తెలియనప్పటికి సహజంగానే వారికి ఆ స్వభావం వస్తుంది. ఈ లోకంలో ప్రతి ఒక్కరు పాపం చేసినవారే. కాబట్టి అందరూ పాపులే. పాపులమైన మనం దేవుని చేరడం అసాధ్యం. మన పాపాలు దేవునికి మనకి అడ్డుగా ఉన్నాయని బైబిల్ చెప్తుంది. **"మీ దోషములు మీకును మీ దేవునికిని అడ్డముగా వచ్చెను"** *యెషయా 59:2.* కాబట్టి పాపియైన మనిషి దేవునిని చేరలేడు. పాపంలో కొట్టు మిట్టాడుతున్న మనిషి తన పరిస్థితిని తనకు తానుగా బాగుచేసుకోలేడు. ఆ పాప బంధకాలు తెంచుకొని రావడం ఎలాగో మనిషికి తెలియదు తెలిస్తే పాపమే చేయకుండా ఉండేవాడు కదా! కాబట్టి మానవుని తన పాప స్థితిలో నుండి రక్షించడానికి ఒక రక్షకుడు కావాలి. ఆ రక్షకుడు యేసే.

ఈత రాని వ్యక్తి నీటిలో కొట్టుకొని పోతూ, రక్షించండి రక్షించండి అని అరుస్తున్నాడు. అటుగా వెళ్తున్న ఒక వ్యక్తి చూసి జాలిపడి రక్షించాలి అనుకున్నాడు కానీ అతనికి

ఈత రాదు కాబట్టి నీళ్ళలో కొట్టుకొనిపోతూ ఉన్న వ్యక్తికి ఏ విధమైన సహాయం చేయలేకపోయాడు. ఇప్పుడు వీళ్ళిదరూ ఇంకెవరైనా వస్తారేమో, మునిగిపోతున్న వ్యక్తిని రక్షిస్తారేమో అని చూస్తున్నారు. ఇంతలో ఈత తెలిసిన వ్యక్తి ఆ దారిన వెళ్తున్నాడు, పరిస్థితి చూసి జాలిపడి తన ప్రాణాలకు తెగించి మునిగిపోతున్న వ్యక్తిని కాపాడాడు.

ఈ సందర్భాన్ని జాగ్రత్తగా గమనించండి. ఇక్కడ నీళ్ళలో మునిగిపోతున్న వ్యక్తి తనంతట తానుగా ఆ పరిస్థితిని అధిగమించలేదు. తను ఎటువంటి ప్రమాదకరమైన పరిస్థితిలో ఉన్నాడో తెలుసు కానీ తనకు తాను సహాయ పడలేదు. తన పరిస్థితిని తాను బాగుచేసుకోలేదు. అందుకే అతను ఎవరైనా తనను రక్షిస్తారేమో అని తనను కాపాడే రక్షకుని కొరకు ఎదురుచూస్తూ, తనను కాపాడమని రక్షించమని అరుస్తున్నాడు. అతనిని పరిస్థితి చూసి జాలిపడే వారు చాల మంది ఉంటారు కానీ ఆ పరిస్థితిని అధిగ మించగలిగే వ్యక్తికి కొన్ని లక్షణాలు ఉండాలి. ఆ వ్యక్తికి ఈత వచ్చి ఉండాలి, కొట్టుకొని పోతున్న వ్యక్తిని చూసి జాలిపడాలి. ప్రమాదంలో ఉన్న వ్యక్తి కొరకు రిస్క్ చేయాలి. నీటిలో మునుగుతున్న వ్యక్తిని చేరడానికి ఈత వస్తే చాలు కాని ఆ వ్యక్తిని ప్రమాదం నుండి బయట పడేయడానికి సరిపోయే బలము, ధైర్యము కలిగి ఉండాలి కదా.

యేసు ప్రభువు పాపరహితుడుగా ఈ లోకంలో జన్మించాడు. ఆయన శరీరేచ్ఛవలన గాక పరిశుద్ధాత్మ వలన జన్మించాడు, పరిశుద్ధమైన జీవితాన్ని (నాజీరు/ ప్రత్యేకమైన) జీవించాడు. ఆయన సమకాలీనులు ఎవ్వరూ ఆయనలో పాపమున్నదని అనలేనంత పరిశుద్ధంగా జీవించాడు ***"నాలో పాపమున్నదని ఎవడు స్థాపించగలడు?"*** యోహాను 8:46. కాబట్టి మరణంపై విజయాన్ని సాధించాడు. పాపానికి ప్రతిఫలంగా ఈ లోకంలోకి వచ్చింది మరణం. అటువంటి మరణానికి పరిశుద్ధుడైన యేసుపై ఎటువంటి అధికారము లేదు. కాబట్టి యేసు ప్రభువు ఒక్కరే పాపపంకిలమైన మనిషి జీవితాన్ని మార్చగలిగే సమర్థుడు. ఆయన మాత్రమే రక్షించడానికి యోగ్యమైనవాడు. ఆయన దేవుడైయుండియు మానవుల స్థితిని చూసి జాలిపడి దానినుండి బయటపడే మార్గాన్ని చూపించడానికి, చూపించడమే కాక ఆ మార్గము తానై జనులందరిని పాపము నుండి రక్షించి, మానవునికి దేవునికి మధ్యవర్తిగా ఈ భూమిపైన పుట్టాడు. స్వయంగా దేవుడే మానవుని రక్షించడానికి పూనుకున్నాడు. అందులో మొట్టమొదటి భాగము భూమిపై దేవుని పుట్టుక. మరి దేవుడు మనపై ఇంత శ్రద్ధ చూపి మన కొరకు మనిషిలా పుట్టడం నిజంగానే మనకు సువర్తమానమే కదా! సంతోషమే కదా!

మరి ఇంత సంతోషాన్ని మనం అనుభవించాలి అంటే ఎవరికి వారుగా యేసుప్రభువును తమ స్వంత రక్షకునిగా అంగీకరించాలి. యేసు ప్రభువు మాత్రమే ఈ లోక పాప భారము నుండి నిన్ను రక్షించి, పరమందున్న దేవుని యొద్దకు నిన్ను చేర్చే ఏకైక మార్గమని విశ్వసించాలి. అప్పుడు మాత్రమే దేవుడు రక్షకునిగా ఈ లోకంలో నీ కొరకు, నా కొరకు పుట్టాడని నీవు గ్రహిస్తావు. ఆ ఆనందాన్ని నీవు అనుభవిస్తావు. అంతే కాదు ఈ క్రిస్మస్ సమయంలో నీ ఆనందాన్ని ఆ ఆనందానికి కారణమైన సువర్తమానాన్ని అన్యజనులకు తెలియపరచాలి. ఉచితంగా నీవు పొందిన రక్షణను, సంతోషాన్ని ఇతరులతో పంచుకోవాలి.



**పాఠకులకు, చందాదారులకు,**

**ప్రకటన కర్తలకు, శ్రేయోభిలాషులకు**

**క్రిస్మస్ శుభాకాంక్షలు!!**

**- చీఫ్ ఎడిటర్**

చిన్నపిల్లల పేజి

# బైబిలు కథలు - నెహెమ్యా

పిల్లలూ!ఎలా ఉన్నారు? క్రిస్మస్ సెలబ్రేషన్స్‌లో బిజీగా ఉన్నారా? డ్యాన్సులు, స్కిట్స్... ప్రాక్టీస్ చేస్తూ బిజీగా ఉన్నారనమాట. మనం ఎంత బిజీగా ఉన్నప్పటికి దేవునికి కొంత సమయాన్ని కేటాయించి, దేవుని జ్ఞానాన్ని తెలుసు కోవాలి. మరి ఈ రోజు కథలోకి వెళ్దామా.

దేవుని మందిరం పట్ల ఆసక్తిని కనబరిచిన వ్యక్తులు బైబిల్లో చాలా మంది ఉన్నారు. వారిలో ఎజ్రా గురించి గత సంచికలో తెలుసుకున్నారు కదా! మరి ఈ సంచికలో నెహెమ్యా గురించి తెలుసుకుందాం




నెహెమ్యా యూదా దేశము నుండి చెరగా బబులోను దేశమునకు తీసుకొని రాబడిన వారిలో ఒకడు. ఇతని తండ్రి పేరు హకల్యా. బబులోనుకు అర్తహషస్త రాజుగా ఉన్న కాలంలో నెహెమ్యా రాజుకు ద్రాక్షారసపు గిన్నె అందించు వాడు. రాజుకు మంచి నమ్మక మైనవాడు. ఒకరోజు యెరూషలేము నుండి వచ్చిన హనానీ అనే వ్యక్తి ద్వారా యెరూషలేము యొక్క దయనీయమైన స్థితిని తెలుసు కున్నాడు. యెరూషలేము కాల్చబడి, దాని ప్రాకారములు పడగొట్టబడి ప్రజలు నివసించడానికి వీలుగా లేదని మరియు చెర తప్పించుకొని యెరూషలేములో నివసిస్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని తన దేశ ప్రజల నిమిత్తము భారము కలిగి ప్రార్థించాడు. అంతేకాక యెరూషలేము పట్టణాన్ని తిరిగి కట్టాలి అని నిర్ణయిం చుకున్నాడు. అటు తర్వాత రాజుకు ద్రాక్షారసపు గిన్నె అందించుటకై రాజు యెదుట నిలిచినప్పుడు రాజు , నెహెమ్యా విచారంగా ఉండటం చూసి - నెహెమ్యా ఎందుకు విచారంగా ఉన్నావు? నీ ఆరోగ్యం బాగాలేదా? అని అడిగాడు. అప్పుడు నెహెమ్యా తన విచారానికి యెరూషలేము పట్టణం యొక్క దయనీయమైన స్థితి కారణమని చెప్పినప్పుడు నీకేమి కావాలో చెప్పమని రాజు అడగగా, యెరూషలేము పట్టణాన్ని తిరిగి కట్టించుటకు తనను యూదా దేశానికి పంపమని, మరియు యెరూషలేము ప్రాకారానికి కావాలసిన దూలాలు, గుమ్మాలు రాజు గారి అధీనంలో ఉన్న అడవులనుండి ఇప్పించమని మనవి చేయగా రాజు నెహెమ్యా మనవి చొప్పున తాకీదు వ్రాయించి యిచ్చి పంపాడు. నెహెమ్యా యెరూషలేము చేరుకొని పట్టణము యొక్క పరిస్థితిని చూచి తెలుసుకొనుటకు రాత్రివేళ ఒక్కడే వెళ్ళి చేయవలసిన పనిని అంచనా వేసుకొని మరునాడు ప్రధానులను, ప్రజలను సమకూర్చి యెరూషలేము పట్టణ ప్రాకారాన్ని దేవుడు మనకిచ్చిన అవకాశం కాబట్టి ప్రతి ఒక్కరు ప్రాకారం కట్టుటకు తమ వంతు పనిచేయాలని దేవుని కృపవలన రాజునుండి పొందిన తాకీదు గురించి వారికి చెప్పి వారిని ఉత్సాహపరచి ప్రాకారపు గోడ కట్టుటకు ప్రారంభించిరి.

యెరూషలేములో నివసించు కొంతమంది అన్యులు యెరూషలేము ప్రాకారపు గోడ కట్టబడుటను ఆపాలని యూదా వారిమీద యుద్ధానికి వచ్చినప్పటికి గోడ కట్టుట ఆగలేదు, అయితే ప్రజలలో కొంత మంది పనిచేస్తుండగా కొంతమంది కావలి కాయువారిగా నియమించి నెహెమ్యా ప్రాకారపు పనిని కొనసాగించాడు.

అన్యులు, యూదులు కట్టుచున్న గోడను గూర్చి ఎగతాళిగా మాట్లాడటం, నెహెమ్యాకు వ్యతిరేకంగా రాజు గారికి పిర్యాదు చేస్తామని బెదిరించినప్పటికి నెహెమ్యా మా చేతులు బలపరుచుమయా అని దేవునికి ప్రార్థించి ఆయనను ఆనుకొని కేవలం 52రోజులలో యెరూషలేము ప్రాకారాన్ని కట్టించి దేవుని మహిమపరిచాడు. ప్రజలందరిని సమకూర్చి యాజకుడైన ఎజ్రా శాస్త్రి సహాయంతో ధర్మశాస్త్ర గ్రంథమును చదివించి దాని ని వివరించి, ధర్మశాస్త్ర గ్రంథములో వ్రాయబడిన ప్రకారం పర్ణశాల పండుగను ఆచరించి దేవునిని మహిమపరిచాడు.

నెహెమ్యా బబులోనులో మంచి స్థితిలో ఉన్నప్పటికి దేవుని మందిరంపై ఉన్న ఆసక్తితో ఎంతో ప్రయాసతో, ఎన్నో శ్రమలుకు ఓర్చి యెరూషలేము పట్టణ ప్రాకారాన్ని కట్టించి దేవుని గ్రంథములో స్థానం సంపా దించాడు. మనం కూడ నెహెమ్యా వలె మందిరపు పనిలో ఆసక్తి కలిగి జీవించాలి. అప్పుడు దేవుడు నెహెమ్యాకు తోడైయున్నట్లు మనకు తోడైయుండి గొప్ప కార్యములు చేయుటకు మనకు సహాయం చేస్తాడు. మరి ఇక నుండైనా మందిరపు పనిలో పాల్గొని దేవుని దీవెనలు పొందుదాం!

**11వ పేజీ తరువాయి....**

ఆయనకు సమీపస్తులుగా ఉండటానికి అవకాశంగా తీసుకోవాలి. దేవునిలో విశ్వాసము ఉంచి ధైర్యంగా ఆయన్ని చేరుకోవాలి.

మదర్ తెరీసా ఒక ఇంటిని అద్దెకు తీసుకొని ఈ కుష్ఠు వ్యాధిగ్రస్తులను ఉంచాలని ప్రయత్నించారు. కాని ఇరుగు పొరుగు వారు భయపడి ఒప్పుకోలేదు. చాలా ప్రతిఘటన ఎదురైంది. మదర్ తెరీసా వీరి కొరకు ఒక ప్రత్యేకమైన వసతిని నిర్మించాలని తలంచారు. 1956లో మదర్ తెరీసాకు ఒక వ్యాన్ బహుమానముగా ఇవ్వబడింది. ఈ వ్యానును గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు మొబైల్ క్లినిక్‌గా ఉపయోగిస్తున్నారు. ఈ వ్యానును కుష్ఠు రోగులుండే ప్రదేశాలకు పంపి వారికి చికిత్స ఇవ్వడానికి నిర్ణయించారు. 1957 సెప్టెంబరులో మొబైల్ లెప్రసీ క్లినిక్‌ను ఆర్చ్‌బిషప్ పెరియర్‌గారితో ప్రారంభోత్సవము గావించబడింది. హౌరా, తిల్‌జాల, ధపా, మోతేజిల్ ప్రాంతాల్లో ప్రతివారం ఈ మొబైల్ వ్యాన్ వెళ్ళేది. ఒక డాక్టర్, ముగ్గురు సిస్టర్స్ వెళ్ళి చికిత్స చేస్తుండేవారు. ఈ మొబైల్ వ్యాన్ నిండా మందులు, భోజనం పెట్టుకొని వెళ్ళేవారు. ఒక సంవత్సరం లోనే ఇంకా నాలుగు ప్రదేశాలకు ఈ మొబైల్ లెప్రసీ క్లినిక్ సేవలు విస్తరించబడ్డాయి.

**(సశేషం)**



# హన్నాకృప క్రిస్టియన్ బుక్ సెంటర్

**రైల్వేస్టేషన్ రోడ్, క్లాపేట, 6వ లైను, ఒంగోలు-523001, ఫోన్: 9440217726**

**మా వద్ద అన్నిరకముల బైబిల్స్, సండేస్కూల్ మెటీరియల్, సండేస్కూల్ బైబిల్ గేమ్స్ మొదలగునవి లభించును. మీకు కావలసిన బైబిల్స్, సండేస్కూల్ మెటీరియల్ ఈ క్రింది వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చును**

**www.onlinetelugubible.net**

ఆధునిక దృక్పథం

# క్రొత్త కోణాలు

# 8. ధన్యతలు : నీతికోసం తృష్ణ - ధన్యతైన తృప్తి

## Beatitudes

**"కనికరము గలవారు ధన్యులు; వారు కనికరము పొందుదురు" – మత్త. 5:7**

"Blessed *are* the merciful : for they shall obtain mercy"_ KJV.

**బైబులులో కొన్ని విషయాల్ని మనం ఉచితంగా పొందుతాం—పాపక్షమ, కృపలాంటివి. వానికి తిరిగి మనం దేవునికి కృతజ్ఞత కన్న మరేమీ బదులియ్యం, యియ్యలేం! మఱి కొన్ని విషయాలున్నాయి—'కనికరం', మానవుల అపరాధాలను క్షమించటం' వంటివి. ఇవి ఇచ్చిపుచ్చుకోవాలని క్రైస్తవ్యం నేర్పిస్తుంది. ఈ ధన్యతలో క్రొత్తకోణమంతా 'కనికరం' గురించి.**

ఈ వ్యాసం క్రొత్తకోణాల్లో తొమ్మిదోది, ధన్యతల వరుసలో ఐదోది. 'వ్యాసం' అంటున్నాం. 'బోధ' లేక 'ప్రసంగం', లేక 'ధ్యానం' అంటంలేదు. ఈ మాటల్ని పవిత్రులు, పరిశుద్ధులైన పాస్టర్లకు వదిలేస్తున్నాను. దేవుని దయవల్ల వాక్యాన్ని నేను బాగానే చదువుకొన్నా, ఎందుకో—అలాంటి గొప్పగొప్ప మాటల్నుపయోగించటానికి తటపటాయించాల్సి వస్తుంది.

### కనికరం

ఈ ధన్యతలో మర్మం కంటే ధర్మం ఎక్కువగా కనిపిస్తుంది. దేవునిలో చూచేదే కాక మానవ మాత్రుల్లో కూడ చూడగల్గేది కనికరం. పరమకసాయి వానిలోనైనా, త్రాగుబోతులోనైనా, రేడికల్‌లోనైనా చూడ గల్గేది కనికరం!

ఈ ధన్యతలో కనికరం ఉంటమేకాదు కాని దానిని చూపటం—అంటే అందుకు తగినట్లుగా కనికరం అవసరమైన వాని యెడల తగురీతిగా మనం మానసికంగా, ఆత్మీయం గానే కాకుండా, కార్యరూపంలో కూడ సంధించటం అనేది ముఖ్యమైంది. మనుష్యులు మీకేమి చేయవలె నని మీరు కోరుదురో మీరు నువారికి ఆలాగే చేయుడి—బైబుల్లో చెప్పిన మాటలు. కనికరం పొందా లంటే కనికరం ఇయ్యాలి (చూపాలి) కూడ!

తమిళనాడు ముఖ్యమంత్రి ఒకరున్నారు. ఆయన పేరు కరుణానిధి. ఆయన ఒకసారి చమత్కారంగా అన్నాడు కదా—నాలో 'కరుణ' అయితే చాల ఉంది కాని, మీకేమైనా చేద్దామా అంటే 'నిధి' మాత్రం చాల కొరతగా ఉంది—అని. కనుక, ఈ ధన్యత రహస్యమంతా ఇందులో ఉన్నట్లనిపిస్తుంది.

### క్రొత్త నిబంధన బోధ

మనమొకటి పొందాలంటే, దాన్ని మనం పంచాలి అనే సూత్రం క్రొత్త నిబంధన అంతటిలో పడుగు-పేకలా అల్లుకపోయి ఉంది. 'కనికరము చూపని వాడు కనికరములేని తీర్పు పొందును; కనికరము తీర్పును మించి అతిశయపడును' అని అపొస్తలుడైన యాకోబు అన్నాడు (యాకో.2:13). ఈ సందర్భంలో యాకో.2:1-13 వాక్యభాగం చదివితే మంచిది. కనికరం యిచ్చి పుచ్చుకొనే సూత్రాన్ని వ.6లో—'అయితే మీరు దరిద్రులను అవమాన పరచుదురు. ధనవంతులు మీమీద కఠినముగా అధికారము చూపుదురు' అనటంలో చేబదుళ్ళు (reciprocal)గా చూపాల్సిన కనికరానికొక ప్రాతిపదిక సూత్రాన్ని(basis) చూడొచ్చు. మనం కనికరం చూపేవారే మనకు కనికరం చూపాలని ఎదురుచూస్తాం. అలా చూపకపోవచ్చు; అనేక సందర్భాల్లో చూపరు కూడా! కాని, మనం చూపిన కనికరం మాత్రం ఎప్పుడో ఒకసారి, ఏదో ఒక సంధర్భంలో, ఎవరో ఒకరి ద్వారా మాత్రం తిరిగు చవి చూడగలమనేది ఈ సర్వ సత్యం (hypothesis) యొక్క పరమార్థం!

కనికరం-క్షమాగుణం కలగాపులగమైనవి. ఈ సత్యాన్ని కళ్ళకు గట్టేట్లు యేసు పేతురుతో చెప్పిన 'క్షమింపని' 'కనికరము చూపని' చెడ్డదాసుని ఉపమానం (మత్త. 18:21-35) తేటతెల్లంచేస్తుంది—"మీలో ప్రతివాడును తన సహోదరుని హృదయపూర్వకముగా క్షమింపని యెడల నా పరలోకపు తండ్రియు ఆ ప్రకారమే మీ యెడల చేయునననెను" (వ.35).

> **పునశ్చరణ (Recapitulation)**
>
> **❑ ధన్యతలన్నింటికీ వర్తించే కొన్ని విషయాలను గత మాసం కొంత వివరంగా పొందుపరచటం జరిగింది. క్రొత్త చదువరులు, పాతవి గతించినవన్నట్లు క్రొత్తగా మొదలు పెట్టే చదువరులు కొన్ని విషయాలు గుర్తు చేసుకొంటేగాని వాని నేపథ్యం అర్థంకాదు.**
>
> **❑ కొండమీది ప్రసంగం (మత్త. 5,6,7 అ.) యేసురాజు పరలోకరాజ్య ప్రణాళిక** (Manifesto of the The Kingdom of Heaven) **అయితే అందలి తొలి పలుకులయిన 'ధన్యతలు' ఆ చట్టాంగానికి అవతారిక** (Preamble) **అనవచ్చు. అంటే యేసురాజ్య మౌలిక సూత్ర సంక్షిప్త సంచయంగా పరిగణించాలి.**
>
> **❑ ధన్యతల వాక్యనిర్మాణం ఇంగ్లీషులో** *are* **అనే క్రియతో భావార్థకాలు** (Statements) **కాగా, హెబ్రీ/అరామీలలో అవి క్రియాపదంలేని ఆశ్చర్యార్థకాలు** (Exclamations)**. తెలుగులో ఇంగ్లీషు వరుసే వచ్చింది. 'దుఃఖపడువారు ధన్యులు (అయియున్నారు)' అనే వాక్యం 'దుఃఖపడటం ఎంత ధన్యత' అవుతుంది.**
>
> **★ ధన్యత అనే మాటకు గ్రీకుపదం 'మాకరియోస్'** (Makarios). **దీని అర్థం ఆ మాటను పేరుగాగల కుప్ర** (Cypres)**. ద్వీపాన్ని బట్టి గ్రహించవచ్చు. ఈ ద్వీపం ఒక ఆనందమయ ద్వీపం. సుందర సిరిసంపదానిలయం. సహజ ఖనిజ సంపత్తి, సస్యశ్యామలం అయిన లోటులేని చోటు. అలాంటి పరిపూర్ణ సంతోషదాయినినే ధన్యతగా గ్రహించాలి. ఇది పరలోక నివాసానికి ఇహలోక సాదృశ్యం.**
>
> **వ్యాసరచనోద్దేశం :**
>
> **పాత నిబంధనలో అబ్రాహాము మొదలు దేవునిని వెంబడించిన వారికి వాగ్దానం చేయబడ్డ దీవెనలు కోకొల్లలు (ఆది. 10:1-3, మలా. 3:10-12). అందుకు ప్రతిగా మన మా దేవుని జనంగా ఉండాలని పదిఆజ్ఞల్లో మన జీవితశైలిని పొందుపరచాడు. వానినే యేసు 'వద్దు', 'కూడదు' అనే మాటల్లో కాకుండా సానుకూల** (Positive) **పదాల్లో ధన్యతలుగా అభివర్ణించాడు. వినగానే యివెలా ధన్యతలురా బాబూ అన్నవి అనన్య బహుమాన సాధకాలుగా కొంత నిగూఢంగా ప్రకటించాడు. దీనిని ఆయన ఉద్దేశించిన క్రొత్త కోణాల్లో పరిశీలించడమే ఈ వ్యాసాల ఉద్దేశం.**

పరలోక ప్రార్థన నేర్పిస్తూ యేసు శిష్యులకు చెప్పింది—'మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మా ఋణములు క్షమించుము' (మత్త. 6:12) అని. ఇదే ఇంగ్లీషులో, 'And forgive us our debts, as we forgive our debtors' అనటంలో *'as'* అనేది just as అనే పోలికగాగాని, లేక సమాంతరంగా జరిగే విషయాలుగా గాని ద్యోతకం కావచ్చు. అయితే, తెలుగులో బహు గంభీరంగా 'క్షమించి యున్న ప్రకారం' అనటంలో, మనం గతంలో అలా చేయటం పూర్తిచేసిగాని ఈ ప్రార్థనాంశాన్ని అడిగి ప్రయోజన ముండదన్నంత కఠినంగా, బాధ్యతాయుతంగా వ్రాయబడింది సుమా! పరలోక ప్రార్థనలో తక్కిన విషయాల మీద యేసు టీకా తాత్పర్యాన్నియ్యలేదు. ఈ ఒక్క విషయాన్నే మరలా **14,15** వచనాల్లో సవిస్తరించటం చూస్తే దీని ప్రాధాన్యత ఎంతో గమనించ వచ్చు.

### ఇంకా లోతైన విషయం

'కనికరం' అనే మాట భావార్థాలు అంతటితో ఆగదు. ఈ ధన్యతలో ఉన్న కనికరం అంతకన్నా లోతయింది. ఒకవేళ ఈ అంశంలో క్రొత్తకోణం అనదగింది యీ విషయమనే అనవచ్చు: (mercy) కనికరం అనేమాట గ్రీకుమూలం 'ఎలెహ్ ఆయ్‌మోన్' అనేమాట. ఎలెహ్' ఆయ్‌మోసూనే ధాతువు నుండి వస్తుంది. దాని

అర్థం—కనికరం చూపు, పడు (మాట, చేతలతో, మరిముఖ్యంగా, దైవకృప ద్వారా); కనికరం, దయకలిగి ఉంటం; కలిగియుండు (పొందు, స్వీకరించు, చూపు) అని. ఇది సర్వసాధారణంగా పేదల దిశలో ప్రసరించేది; అంటే బిక్షం, ధర్మం, సహాయం చేయడమని.

అయితే, మన క్రొత్తనిబంధన గ్రీకు ఇంకా ఆదిలోకి, అంటే హెబ్రీ లేక అరామి భాషాప్రయుక్తంగా ఉంటుంది. కనుక, ఈ గ్రీకుమాటలు ఆదిమ హెబ్రీమాట అయిన చెసెద్(chesed) కు దారితీస్తుంది. అయితే, ఈ హెబ్రీమాటలో అర్థమంతా వచ్చేట్లు తర్జుమా చేయగల్గిందికాదు.

మన అనుదిన జీవితానుభవంలో సానుభూతి, కనికరం అనే మాటల్లోని అర్థం, క్రియ మాత్రమే అనుకోరాదు. అక్కరలో, ఆపదలో ఉన్న వారిని పాపం తలచటం లేక అనటం (feel or say sorry) మాత్రమే కాదు. 'చెసెద్' అనే మాట మూలంగా గల 'కనికరం'లో అక్కరలో ఉన్న మనిషి మెదడు, హృదయం, నరనరాల్లో మనం ప్రవేశించగల్గటమని. దీన్ని ఇంగ్లీషులో ఒక చక్కని phrase తో చెప్పొచ్చు: to get under the skin! అంటే ఎదుటివాని పరిస్థితి, సంక్షోభాన్ని అతడెంతగా ఆక్రో శిస్తుంటాడో అంత మేరవరకు పోగల్గట మని.

కనుక, కనికరం కేవలం మనలో కలిగే భావోద్రేకం వల్ల చూపే దయా దాక్షిణ్యాలు (pity) కాదు. మనమనస్సు, సంకల్పాలను ఈ భావోద్రేకం వశం చేసుకోవాలి. ఈ కనికరాన్ని ఏదో ఒక వస్తువును పోస్ట్‌మేన్‌లా అందించేది కాదు. అక్కరలోని మనిషి ఆవేదనతో పూర్తి తాదాదమ్యత, పాలిభాగస్వామ్యం పొందుతూ, ఒక విధంగా, నీవే ఆ పరిస్థితిలో ఉంటే నీకు నీ విషయంలో నీవే ఎలా స్పందిస్తా వన్నంత సాదృశ్యత అన్నమాట. కనుక, సానుభూతిని సింపతీ అంటాము కదా. Sympathy అనే ఇంగ్లీషు మాట కూడ 'Syn' గ్రీకులో అంటే 'కలిసి', ఒకటిగా (together with) అనిన్నీ, pathy అనేభాగం పాస్‌ఛ్చీన్ (paschein) నుండి, అంటే, అనుభవించు (experience), శ్రమపడు (suffer) అనిన్నీ—మొత్తంమీద 'మరొక వ్యక్తితో కలిసి ఒకటిగా అనుభవించట'మని అర్థం. దీనికి చక్కగా సి.పి.బ్రౌన్, తన డిక్షనెరీలో Sympathy అంటే fellow-feeling అంటూ, 'నవ్వేవాడితో కూడ నవ్వడం, యేడ్చేవారితో కూడ యేడవటం' అని విశదీకరిస్తూ, మాటకు అర్థంగా, పరితాపం, అనుతాపం, కరుణ అని రాశాడు. అదే శబ్దరత్నాకరంలో 'సానుభూతిష అని ప్రత్యేకంగా మాటను list చేయలేదు. 'అనుభూతి' వద్ద దాని అర్థం. 'అనుభవం'. అది ఆంతరంగంలో ఉద్భవించి క్రియాత్మంగా పరిఢవిల్లుతుంది! 'సాను భూతి'లో 'స' అంటే 'మంచి' అనే అర్థం ఒకవేళ ఇక్కడ ప్రస్థావించ బడుతున్న Sympathyతో సరితూగకపోవచ్చు. స్వానుభవ మంటే అది స్వంత అనుభవమే కావచ్చు. కనుక ఈ Chesed (చెసెద్) అనేమాట బహు గంభీరమయింది. అంటే, ఒక విషయం సానుభూతి మన స్వయిష్ట ప్రకారంగా చేసేదికాదు ఆవేదన'; పొందే వానిపక్షంగా గ్రహించాల్సింది. ఈ సందర్భంలో రెండుమూడు సంగతులు చూద్దాం.

### 1. తప్పుత్రోవలో సానుభూతి

మనం వేసే భిక్షం, చేసే సహాయం, యిచ్చే చందాలు మొదలైనవన్నీ ఇక్కడ చెప్పబడిన కనికరంతో సరితూగవు. చాలాసార్లు బాధితులు కోరే సానుభూతి ఒక్కటైతే మనం ఒలకపోసేది మరొకటి. దీనికి అచ్చుపోసిన ఉదహరణ మరియమార్తల ఉదంతం. (లూకా **10:38-42**). యేసు సిలువ శ్రమలు ఎంతో దూరంలో లేవని ఆయనకు తెలుసు. ఆయన బేతనియలోని మరియ మార్తల యింటికి వచ్చినప్పుడు ఆయన కోరుతుంది ప్రశాంతత. మార్త ఆయన్ని ప్రేమించింది. అయితే, డేగిశాల గడబడల్తో, మరియ సహాయం చేయడం లేదనే చిఱ్ఱుబుఱ్ఱుల్తో హంగామా చేస్తుండింది. మరియ, యేసు నిజమానసిక పరిస్థితి నర్థం చేసుకొంది. ఆయనతో ప్రశాంతంగా కూర్చుని, బహుశః, మౌనసముద్రంలో ఆయన హృదయ వేదనకు తన హృదయ వేదికను సమర్పించింది! అందుకే, ఆమె ఉత్తమమైనది కోరు కొనిందని ప్రభువు ప్రస్తావించాడు. చేపనియ్యమంటే పామునియ్యొద్దు!


### 2. కనికరం క్షమను సులభం చేస్తుంది

ఇతరులొక పని ఎందుకు చేశారా అనివారి దృక్పథంలో ఆలోచించినప్పుడు తప్పుఒప్పుగా కనిపిస్తుంది; క్షమాపణ సులభమవుతుంది. ప్రతివ్యక్తి తలంపులోగాని, చేసేపనుల్లోగాని ఒక కారణం, హేతువు (reason) ఉంటుంది. అది తెలుసుకొనే కనికరం ఉంటే క్షమించటం ఎంతో సులభతరమౌతుంది. నేటి శిక్షాస్మృతి (Crime & Punishment) విధానంలో క్షమించటం అసంభవమనుకొన్న ఉరిశిక్షార్హుల కెందరికో క్షమాభిక్షతో విడు దల కలగటం చూస్తున్నాం. కొన్నిసార్లు సరియైన సాక్షాధారాలు లేక కావచ్చు. అయితే, అతడు చేసిన నేరానికి గల చోదకం(motive)ను అర్థంచేసు కొనటం వల్ల కూడానని చూడొచ్చు.

### 3

అసలు, దేవుడు మనలను క్షమిస్తున్నాడంటే మన రక్తమాంసాల్లో నేరగుణం (పాపం) అణువణువున జీర్ణించుకు పోయిందనే అవగాహన, దానివల్లవచ్చే కనికరంనుబట్టేనని నేను పూర్తిగా నమ్ముతున్నాను. దేవుడు కోరేది, బహుశః పాపం చేయొద్దనే దానికంటే పశ్చాత్తాపపడి దానికి దూరంగా ఉండి రక్షణ ఫలాల్ని విరియగాయమని!

పరిశుద్ధుడైన దేవునిగా చేయలేని పనిని తానే కుమారునిగా, మర్త్యునిగా యీ లోకానికి వచ్చాడు. మానవుల 'చర్మం క్రింద దూరాడు'! మానవునిగా వచ్చి మానవ కళ్ళతో చూచాడు. మానవ స్పృహతో స్పందించాడు. మానవ జీవితంలో లీనమయ్యాడు (పాపంతో కాదులే!), కనుక, మానవుల్ని రక్షంచటానికి స్వరక్త మిచ్చాడు. అంటే, కొన్ని యితర మతాల్లో చెప్పినట్లు సుదూరంగా, అంటకుండా, వేరుగా, అన్నింటికన్నా మహాగంభీర స్వరూపిగా గాక ఒక సాదాసీదా మానవునిగా వచ్చాడు. **చెసెద్** అనే మాటలోని అర్థం మూసపోస్తే క్రీస్తు దివినుండి భువికి వచ్చినదంతా మూర్తీభవిస్తుంది. ఆ కనికరం చూపగల్గిన వారికి కనికరం, ముఖ్యంగా దేవుని కృపా సమృద్ధ కనికరం, కలుగుతుంది. అదే — ధన్యతైన తృప్తి!



### ఒక క్షమాపణ
### (AN APOLOGY)

ఈ వ్యాసాల్లో గ్రీకు పదాలని చెప్పటం జరుగుతుంది. కొంతమంది పాఠకులకు అది కఠిన మనిపిస్తుంది. మరికొందరికి నా పాండిత్యం వెలగబెడుతున్నాననే వెటకారం పుడుతోంది—సహజమే. నేను గ్రీకు పండితుణ్ణి కాదు; కనీసం ధారాళంగా చదువనైనా రాదు. అయినా, కష్టపడి, ఆయా గ్రంథాల్లో సేకరించి, కొంచెం పై అంతస్తులో అర్థం చేసుకొనే వారికోసం ఈ విషయాలు జొప్పిస్తున్నాను. అదే నా పరిశ్రమ; సేవ. మరో ఆలోచన కూడ వస్తుంది: బైబులు విషయాలు అందరికీ అర్థం అయ్యేలా సింపుల్‌గా ఉండాలి కదా! అవును. కాని, మనం దేవుని వాక్యంలో ఎదగాలి కూడ. బెతెస్డా తటాకం ప్రక్క తిష్ట వస్తే చాలదు (**యోహా.5:1-6**). ఈ గ్రీకు మాటల బరాటా తీసివేసి చదివినా విషయం బోధపడుతుంది. —**అజావె**

**వచ్చే మాసం: దేవుణ్ణి చూట్టం**

## చందాదారుల వివరాలు

| | | |
|---|---|---|
| శ్రీమతి కె. సుభద్ర, విజయవాడ | రూ. | 2,000 |
| శ్రీ కెల్లి ఐజక్ సుకుమార్, ఒంగోలు, ప్రకాశం జిల్లా | రూ. | 3,000 |
| శ్రీమతి పి. అనిత, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం జిల్లా | రూ. | 1,200 |
| కుమారి జయదేవి, గుంటూరు | రూ. | 1,000 |
| శ్రీమతి ఆర్. జయమ్మలాబాను, గుంతకల్ | రూ. | 1,000 |
| శ్రీమతి సి.హెచ్.సుభాషిణి, గుడివాడ, కృష్ణాజిల్లా | రూ. | 1000 |
| శ్రీ కె. ఐజక్ ఒంగోలు, ప్రకాశం జిల్లా | రూ. | 1000 |
| పేరు తెలీదు (21-2-18 తేది) బ్యాంక్ అకౌంట్ | రూ. | 1000 |
| శ్రీమతి రాజ్యలక్ష్మి, భోపాల్ | రూ. | 1000 |
| శ్రీమతి రత్నకుమారి, కరీంనగర్ | రూ. | 500 |
| శ్రీ పరుసు వెంకటరావు, బెంగుళూరు | రూ. | 500 |
| శ్రీ పి. యేసుబాబు లోకేష్, ఎర్రంపల్లి, ప.గో.జిల్లా | రూ. | 500 |
| శ్రీ పి. దేవదానం, నగరంపాలెం, గుంటూరు | రూ. | 500 |
| కుమారి లీనా, బెంగుళూరు | రూ. | 500 |
| శ్రీ వి. యోహాను, వనపర్తి, మహబూబ్‌నగర్‌జిల్లా | రూ. | 500 |
| శ్రీమతి కె.లూధియ, గోగులమూడి, గుంటూరుజిల్లా | రూ. | 500 |
| శ్రీ యం. నిర్మల్‌కుమార్, అనంతపురం | రూ. | 500 |
| శ్రీ ఎ. శ్రీనివాసరెడ్డి, హైదరాబాద్ | రూ. | 500 |
| కుమారి యం. విక్టోరియారాణి, యర్రగొండపాలెం | రూ. | 500 |
| శ్రీ ఏ. పరిశుద్ధ రాజు, నరసాపురం | రూ. | 500 |
| పాస్టర్.టి.రమేష్ అబ్రాహాము, పెన్నాడ, ప.గోజిల్లా | రూ. | 500 |
| శ్రీ పి. ఇమ్మానియేలు, విజయవాడ | రూ. | 500 |
| శ్రీమతి గ్రేస్ మంజుల, బెంగళూర్ | రూ. | 500 |
| శ్రీమతి యు.మేరీసలోమి, సిరివెల్ల, కర్నూలు | రూ. | 500 |
| శ్రీ యం. శ్యాంబాబు, కైకలూరు, కృష్ణా జిల్లా | రూ. | 500 |
| పేరు తెలీదు (తేది19-03-19) బ్యాంక్ అకౌంట్ | రూ. | 500 |
| పేరు తెలీదు (తేది12-10-17) బ్యాంక్ అకౌంట్ | రూ. | 400 |
| పేరు తెలీదు (తేది31-03-19) బ్యాంక్ అకౌంట్ | రూ. | 400 |
| పాస్టర్ పి. సత్యానందం, మౌలాలి, హైదరాబాద్ | రూ. | 300 |
| పాస్టర్ జి. నల్లయ్య, కందుకూరు, ప్రకాశంజిల్లా | రూ. | 300 |
| శ్రీ కె. సురేష్, ఉప్పరపల్లె, కడప జిల్లా | రూ. | 300 |
| శ్రీ టి. నాగరాజు, చీమకుర్తి, ప్రకాశంజిల్లా | రూ. | 300 |
| శ్రీ ఐ. అనిల్‌కుమార్, కాకినాడ, తూ.గో.జిల్లా | రూ. | 300 |
| శ్రీమతి యం. పుల్లమ్మ, కడప | రూ. | 300 |
| శ్రీ బాలాజీరావు సింథియా, వైజాగ్ | రూ. | 300 |
| కుమారి షెఫేలా, దొనకొండ, ప్రకాశం జిల్లా | రూ. | 300 |
| శ్రీ కె. ఉజ్జీవరాజు, వనపర్తి, మహబూబ్‌నగర్‌జిల్లా | రూ. | 250 |
| శ్రీమతి వి.శారాభాయి, భీమవరం | రూ. | 250 |
| శ్రీ ఆర్. ఇన్నయ్య, గుంతకల్లు | రూ. | 200 |
| శ్రీ టి. చిన్నా, మల్కీపురం, తూ.గో.జిల్లా | రూ. | 200 |
| శ్రీమతి బి. ప్రేమలత, కడప | రూ. | 200 |
| శ్రీమతి కె. వాణికుమారి, చీరాల, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీ డి. సుమన్, రుద్రాంగి, కరీంనగర్‌జిల్లా | రూ. | 200 |
| పాస్టర్ పి. కొర్నేలి, మామిళ్ళపల్లి, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీమతి జి. లీలారాణి, ఒంగోలు, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీ బి. నాగభూషణం, వెంకటగిరి, నెల్లూరుజిల్లా | రూ. | 200 |
| శ్రీ పి. దేవదానం, పెదదోర్నాల, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| కుమారి కె. లక్ష్మిప్రియ, ఒంగోలు | రూ. | 200 |
| శ్రీ కె. దుర్గాప్రసాద్, రాజమండ్రి | రూ. | 200 |
| శ్రీ పి. గిద్యోను, నేరేడ్‌మెట్, హైదరాబాద్ | రూ. | 200 |
| శ్రీ వై. జోసఫ్, భీమవరం, ప.గో.జిల్లా | రూ. | 200 |
| శ్రీమతి టి.నిర్మలశాంసన్, వెలిగండ్ల, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీమతి కె. ప్రేమారూత్, గుంటూరు | రూ. | 200 |
| శ్రీ కె. జెకర్యా, నర్సీపట్నం, విశాఖపట్నజిల్లా | రూ. | 200 |
| శ్రీమతి యం. అరుణకుమారి, విశాఖపట్నం | రూ. | 200 |
| శ్రీ కె. యెషయా, ఆర్.జి.పురం, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీమతి టి. సుమలత, ఆర్.జి.పురం, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీమతి ఎన్. సరోజిని, నెల్లూరు | రూ. | 200 |
| శ్రీమతి జి. రోజమ్మ, చీరాల, ప్రకాశం జిల్లా | రూ. | 200 |
| శ్రీమతి సి.హెచ్. పుష్పారాణి, కాకినాడ | రూ. | 200 |
| శ్రీ కె. లాజరస్, కొయ్యలగూడెం, ప.గో.జిల్లా | రూ. | 200 |
| శ్రీ యం.శ్రీకర్‌కుమార్, జజ్జూరు, కృష్ణాజిల్లా | రూ. | 200 |
| శ్రీ ఆర్. శ్రీనివాస్, రావులపాలె, తూ.గో.జిల్లా | రూ. | 200 |
| శ్రీ పి. దేవదానం, నగరంపాలెం, గుంటూరు | రూ. | 200 |
| శ్రీ యం. ఐజక్, దాసన్నపేట, విజయనగరం | రూ. | 200 |
| శ్రీమతి కె. హేమాబాబ్జి, భీమవరం | రూ. | 200 |
| శ్రీమతి జె.డి. సుహాసిని ,రాజమండ్రి,తూ.గో జిల్లా | రూ. | 200 |
| శ్రీ సి.హెచ్.రామక్రిష్ణ, ఏలూరు, ప.గో జిల్లా | రూ. | 200 |
| శ్రీ కె.రవికుమార్, హైదరాబాదు | రూ. | 200 |
| శ్రీ కె.వి.వి.రమణ, గండేపల్లి, తూ.గో జిల్లా | రూ. | 200 |
| శ్రీ యం. అబ్రాహాము, తాడేపల్లి, గుంటూరు | రూ. | 200 |
| పేరు తెలీదు (తేది.7-4-18), బ్యాంకు అకౌంట్ | రూ. | 200 |
| పేరు తెలీదు (తేది.15-4-18), బ్యాంకు అకౌంట్ | రూ. | 200 |
| శ్రీ టి. మరియబాబు, గొట్టిపాడు, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| శ్రీమతి బి. కళ్యాణి, బెంగుళూరు | రూ. | 200 |
| పాస్టర్ బి. నెహెమ్యా, చిన్నగంజాం, ప్రకాశంజిల్లా | రూ. | 200 |
| యు. మేరి సలోమి, సిరివెళ్ళ, కర్నూలు జిల్లా | రూ. | 200 |
| శ్రీ పి. జగదీష్, మధిర, ఖమ్మం జిల్లా | రూ. | 200 |
| శ్రీ యల్. నాగరాజు, నంధ్యాల, కర్నూలు జిల్లా | రూ. | 200 |
| శ్రీ యస్. గోపి, పార్వతిపురం,విజయనగరం జిల్లా | రూ. | 200 |

| | | |
|---|---|---|
| శ్రీ యస్. విద్యాసాగర్, ఆత్మకూరు,కర్నూలు జిల్లా | రూ. | 200 |
| శ్రీమతి కె. లలిత భాగ్యం, కనిగిరి, ప్రకాశం జిల్లా | రూ. | 200 |
| పేరు తెలీదు (7-2-19 తేది) బ్యాంక్ అకౌంట్ | రూ. | 200 |
| శ్రీ ఐ. రాజ్‌కుమార్, గుంటూరు | రూ. | 200 |
| శ్రీమతి.టి. సూర్యకుమారి, మహబూబ్ నగర్ | రూ. | 200 |
| శ్రీ టి. నాగార్జున, కరీంనగర్ | రూ. | 200 |
| శ్రీ కె. బెంజిమెన్, విజయవాడ, కృష్ణా జిల్లా | రూ. | 200 |
| శ్రీ కొట్టె కమల్, శ్రీరాంపురం, ఆదిలాబాద్ | రూ. | 150 |
| పాస్టర్ జె. జయరాములు, కాకినాడ | రూ. | 150 |
| పాస్టర్ ప్రకాశం, నారాయణపురం, వరంగల్‌జిల్లా | రూ. | 150 |
| శ్రీ కె.జె. జ్యోతిరాజ్, మార్కాపురం | రూ. | 150 |
| శ్రీ పి. ఆనంద్‌సాగర్, కాకినాడ | రూ. | 150 |
| పాస్టర్ వి.ఎ.యస్.ప్రసాద్, జడ్చర్ల | రూ. | 150 |
| పాస్టర్ టి. విజయపాల్, నరసరావుపేట | రూ. | 150 |
| శ్రీమతి బి. ఎస్తేర్‌రాణి, గోగులమూడి, గుంటూరు జిల్లా | రూ. | 150 |
| పాస్టర్ టి. ఆదాము, శంకవరప్పాడు, ప్రకాశంజిల్లా | రూ. | 150 |
| పాస్టర్ ఎ మత్తయ్య, వినుకొండ, గుంటూరు జిల్లా | రూ. | 150 |
| శ్రీ పి. చిన్నారావు, విజయవాడ, కృష్ణాజిల్లా | రూ. | 150 |

**మనియార్డరు ద్వారా, నెట్ బ్యాంకింగ్ ద్వారా డబ్బు ట్రాన్స్‌ఫర్ చేసిన వారు తప్పని సరిగా మాకు ఫోన్ చేసి తెలియజేయాలి. లేనిచో వారి పేరు చందాదారుల లిస్టులో ఉండదు. చందాకట్టిన వారిలో ఎవరి పేరైనా లేనిచో దయచేసి 9440217726 నంబరుకి ఫోన్ చేయమని కోరుచున్నాము**

**బైబిల్ క్విజ్ - 52 పశ్నలకు జవాబులు వ్రాసిన వారు :**


1) **శ్రీమతి జె.డి.సుహాసిని,** రాజమండ్రి, తూ.గో. జిల్లా
2) **పాస్టర్ జె.జయరాములు,** కాకినాడ, తూ.గో.జిల్లా
3) **శ్రీమతి కె.లలితాభాగ్యం,** కనిగిరి, ప్రకాశం జిల్లా
4) **శ్రీమతి.యస్‌డి. మాలిని,** ఒంగోలు, ప్రకాశం జిల్లా
5) **శ్రీమతి కె. సుభద్ర,** విజయవాడ
6) **శ్రీమతి జయమ్మలాబాను,** గుంతకల్లు, అనంతపురంజిల్లా

## ప్రకటన

**క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. ఉత్తమ కథకు నగదు బహుమానం వుంటుంది. క్రైస్తవకథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.**

## ఈ నెల ప్రశ్న -డిసెంబర్-2019

**ఎవరి మీద జనులు పగపట్టుదురు?**
(ఆమోసు) (రెఫరెన్సు తప్పని సరిగా ఉండాలి)




మీ జవాబు ఈ నెల 20వ తేదీ లోపు మీ పేరు, పత్రిక సీరియల్ నంబరుతో 9440217726 నంబరుకి **SMS** ద్వారా పంపించాలి. సరైన సమాధానం పంపిన వారిలో 'లక్కిడిప్' ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి రూ. 125/- లు విలువ చేసే **'ఆంధ్రక్రైస్తవ ఉజ్జీవ కీర్తనలు'** అనే 1000 పాటలు ఉన్న పుస్తకము బహుమతిగా ఇవ్వబడుతుంది. అయితే ఈ అవకాశం **'చందాదారులకు మాత్రమే'**. అనగా చందా చెల్లించిన వారు మాత్రమే ఈ ప్రశ్నకు జవాబు పంపించాలి. 20వ తేది లోపు చందా చెల్లించే వారు కూడా పాల్గొనవచ్చును.

**నవంబర్ నెల ప్రశ్నకు జవాబు పంపించిన వారు**
జవాబు : సూర్యచంద్రులకు (యోవేలు 2:10)

1) శ్రీమతి కె. లలితాభాగ్యం, కనిగిరి, ప్రకాశం జిల్లా
2) శ్రీమతి జయమ్మలాబాను, గుంతకల్, అనంతపురం జిల్లా
3) శ్రీమతి జె.డి.సుహాసిని, రాజమండ్రి
4) పాస్టర్ జె.జయరాములు, కాకినాడ, తూ.గో.జిల్లా
5) శ్రీమతి కె. సుభద్ర, విజయవాడ

## బైబిల్ క్విజ్ - 52 జవాబులు

**1.** దేవుడు మనకు తోడు (మత్తయి 1:21) **2.** యిర్మీయా (2:17,18) **3.** 3:17 **4.** అంద్రెయ (4:18) **5.**శత్రువులను (5:44) **6.** నీతి (6:33) **7.** బుద్ధిమంతుని (7:24) **8.** యెషయా (8:17) **9.** పనివారు (9:37) **10.**పావురముల (10:16) **11.** కపెర్నహూమా(11:23) **12.**విరోధి (12:30) **13.** దేవదూతలు (13:39) **14.** నాలుగవ (14:25) **15.**7 (15:37) **16.** సీమోను పేతురు (16:16) **17.** కుమారులు (17:26) **18.** లోకమునకు (18:7) **19.** మొదటివారు (19:30) **20.** ప్రధానయాజకులకును, శాస్త్రులకును (20:18)



# అక్షరయజ్ఞం

## క్రిస్మస్ స్పెషల్ బైబిల్ క్విజ్

(మత్తయి, లూకా సువార్తలు)



శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్

1. అబ్రాహాము నుండి క్రీస్తు వరకు ఎన్ని తరములు?
2. "నా ప్రాణము ప్రభువును ఘనపరచుచున్నది" అన్నది ఎవరు?
3. ఇమ్మానుయేలు అను మాటకు అర్థమేమి?
4. మరియ భర్తయైన యోసేపు ఏ వంశస్థుడు?
5. యేసుని దర్శించుటకు జ్ఞానులు ఎక్కడ నుండి వచ్చెను?
6. మొదటి ప్రజాసంఖ్య వ్రాయవలెనని ఆజ్ఞ అయిన ప్పుడు సిరియ దేశమునకు అధిపతి ఎవరు?
7. శిశువును ఆయన తల్లిని వెంటబెట్టుకొని ఎక్కడకు పారిపొమ్మని దూత యోసేపుతో చెప్పెను?
8. "దేవుని దృష్టికి నీతిమంతులైయుండిరి" అని ఎవరి గురించి చెప్పబడింది?
9. హేరోదు కుమారుని పేరేమిటి?
10. ప్రవక్త్రియైన అన్న ఏ గోత్రికురాలు?
11. జ్ఞానులు ఏమేమి కానుకలు సమర్పించిరి?
12. మరియ ఎంతకాలం ఎలీసబెతుతో ఉండెను?
13. 2సం॥లు మొదులుకొని తక్కువ వయస్సుగల మగ పిల్లలను వధించినది ఎవరు?
14. యెరూషలేమునందు నీతిమంతుడును భక్తిపరుడైన మనుష్యుడు ఎవరు?
15. ఎన్నవ దినమున యేసునకు సున్నతి చేయబడెను?
16. రామాలో అంగలార్పు గూర్చి ప్రవచించినది ఎవరు?
17. ఏ పండుగను ఆచరించుటకు యేసు తల్లిదండ్రులతో యెరూషలేము వెళ్ళెను?
18. యోసేపు గలిలయ ప్రాంతములోని ఏ ఊరిలో కాపురముండెను?
19. యేసు బోధింప మొదలు పెట్టినప్పుడు ఆయన వయస్సెంత?
20. యేసు నజరేతు విడచి ఎక్కడకు వచ్చి కాపురముండెను?

**గమనిక**

మీ జవాబులను **SMS/Whatsapp**ద్వారా కూడా పంపవచ్చును. **SMS/Whatsapp** ద్వారా పంపేవారు మీ పేరు, అడ్రస్ లేబుల్ మీద ఉన్న సీరియల్ నంబరుతో **"క్రిస్మస్ స్పెషల్ బైబిల్ క్విజ్"** అని టైపు చేసి, ప్రశ్న నంబరు, జవాబు, బైబిల్ రెఫరెన్సుతో జవాబులన్నీ ఒకే మేసేజ్‌లో 9440217726 నంబరుకు పంపాలి. పోస్టుకార్డు లేదా ఎన్వలప్ కవరు ద్వారా జవాబులు (తెల్లపేపరు మీద, అడ్రస్ లేబుల్ మీద ఉన్న సీరియల్ నంబరు, మీ ఫోన్ నంబరు వ్రాసి) పంపదలచిన వారు ఈ నెల 20వ తేదిలోపు **పరిశుద్ధత-బైబిల్ క్విజ్, పోస్టుబాక్స్ నెం.28, ఒంగోలు-523001** అడ్రసుకు పంపగలరు.

**అన్ని ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాసిన వారిలో ఒకరికి "నా కుమారి" (మోయాబీయురాలి కథ) అను పుస్తకము (వెల రూ. 70/-) లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి ఉచితంగా పంపబడును**

**గమనిక**

ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించ వచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం.